



మేహాద్రిగెడ్డ రిజర్వాయర్

మేహాద్రికి జల కళ

- 57.5 అడుగులకు చేరిన నిల్వలు
- పూర్తిస్థాయి నీటి మట్టం 61 అడుగులు
- మరో రెండు అడుగుల మేర నీరు చేరితేనే దిగువకు విడుదల

గోపాలపట్నం, సెప్టెంబరు 9: భారీవర్షాలతో మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నిండుకుండను తలపిస్తోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 61 అడుగులు కాగా..ప్రస్తుతం 57.5 అడుగుల మేర నిల్వలున్నాయి. మరో రెండు అడుగులు నీరు చేరితేనే గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేయాల్సి ఉంటుందని, అప్పటివరకూ ఎలాంటి ప్రమాదం లేదని అధికారులు చెబుతున్నారు. కాగా రిజర్వాయర్‌ను కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సోమవారం పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడం, ఇన్‌ఫ్లో లేకపోవడంతో నీటిమట్టం స్థిరంగా ఉందని, భారీవర్షాలు కురిస్తే నాలుగు గేట్లను ఎత్తి, వరదనీటిని దిగువకు విడుదల చేయాల్సి ఉంటుందని ఇంజనీరింగ్ అధికారులు ఆయనకు వివరించారు. రిజర్వాయర్ గేట్లు ఎత్తాల్సిన పరిస్థితులు ఎదురైతే ముందస్తుగా లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, ముంపు ప్రాంతాల వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్‌లో నీరు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో చేపలు పట్టేవారు లోపలకు వెళ్లకుండా నియంత్రించాలని సూచించారు.

కొండవాలు ప్రాంతాల్లో 12,750 కుటుంబాలు

- రక్షణకు ప్రత్యేక కార్యాచరణ
- మేహాద్రిగెడ్డ గేట్లు మరమ్మతులకు రూ.2 కోట్లతో ప్రతిపాదన
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్



గోపాలపట్నం రామకృష్ణానగర్‌లో కొండచరియలు జారిపడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్న 12,750 కుటుంబాల రక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కొండవాలు ప్రాంతాల్లో పలుచోట్ల రక్షణ గోడలు ప్రమాద పరిస్థితికి చేరుకున్నాయన్నారు. కొండవాలు ప్రాంతంలో నివసిస్తున్న 96 కుటుంబాలు ప్రమాదంలో ఉన్నాయని గుర్తించామన్నారు. విశాఖ రూరల్ మండల పరిధిలో 6,900 కుటుంబాలు, గోపాలపట్నంలో 2,272, భీమిలి మండలంలో 1,100, పెదగంట్యాడలో 750, పెందుర్తిలో 716,ములగాడలో 650, గాజువాకలో 190 కుటుంబాలు కొండవాలులో నివాసం ఉంటున్నాయన్నారు. వచ్చే తుఫాన్ సీజన్‌లో ఇబ్బందులు లేకుండా కొండవాలు ప్రాంతాల్లో నివాసితుల రక్షణకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. భారీవర్షాలకు మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ 58 అడుగులకు చేరిందని, మరో మూడున్నర అడుగులు నిండితే పూర్తిస్థాయి మట్టానికి చేరుకుంటుందన్నారు. వర్షాల నేపథ్యంలో రిజర్వాయర్‌ను సందర్శించి పరిస్థితి సమీక్షించామన్నారు. రిజర్వాయర్‌కు ఆరు గేట్లలో శిథిలావస్థకు చేరిన రెండింటి మరమ్మతులకు రూ.రెండు కోట్లతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థకు ప్రతిపాదనలు పంపామన్నారు. రిజర్వాయర్ నుంచి నీరు ప్రవహించే కొండగెడ్డ నిర్వహణకు

... మిగతా 6వ పేజీలో



ముడసర్లోవ రిజర్వాయర్

మూడురోజులపాటు కురిసిన వర్షాలకు భారీగా చేరిన నీరు

- గరిష్ఠ స్థాయికి చేరిన నీటిమట్టాలు
- ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో ఏలేరు, తాటిపూడి రిజర్వాయర్ల నుంచి దిగువకు నీరు విడుదల
- మేహాద్రిగెడ్డ నీటిమట్టం మరింత పెరిగితే దిగువకు విడిచిపెట్టే అవకాశం

జలాశయాలు కళకళ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరానికి తాగునీటిని సరఫరా చేసే రిజర్వాయర్లన్నీ కళకళలాడుతున్నాయి. పశ్చిమ బంగాళాఖాతంలో ఉన్న వాయుగుండం ప్రభావంతో మూడు రోజులపాటు ఇటు శ్రీకాకుళం జిల్లా అటు కృష్ణా జిల్లా వరకూ విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో అన్ని రిజర్వాయర్లు గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. ఏలేరు, తాటిపూడి రిజర్వాయర్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తుండగా, మేహాద్రిగెడ్డకు ఇన్‌ఫ్లో కొనసాగితే మంగళవారం గేట్లు ఎత్తే అవకాశం ఉంది.

రిజర్వాయర్	గరిష్ఠ నీటిమట్టం	ప్రస్తుతం
ఏలేరు	86.56 మీటర్లు	85.7 మీటర్లు
రైవాడ	114 మీటర్లు	111.37 మీటర్లు
మేహాద్రిగెడ్డ	61 అడుగులు	58 అడుగులు
తాటిపూడి	297 అడుగులు	290.2 అడుగులు
గోస్తనీ	35 అడుగులు	29 అడుగులు
ముడసర్లోవ	169 అడుగులు	163 అడుగులు
గంభీరం	126 అడుగులు	125 అడుగులు

నగరవాసుల తాగునీటి అవసరాలతోపాటు పరిశ్రమలకు కావాల్సిన నీటిని తూర్పుగోదావరి జిల్లాలోని ఏలేరు రిజర్వాయర్‌తోపాటు విజయనగరం జిల్లా తాటిపూడి, అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలో గల రైవాడ రిజర్వాయర్‌తోపాటు నగర పరిధిలో ఉన్న మేహాద్రిగెడ్డ, ముడసర్లోవ, గంభీరం రిజర్వాయర్ల నుంచి సేకరిస్తుంటారు. అయితే రైవాడ, ఏలేరు, తాటిపూడి రిజర్వాయర్ల నుంచి ఎక్కువభాగం నీటిని వ్యవసాయ అవసరాలకు కేటాయించాల్సి ఉంటుంది. వేసవి సీజన్‌లో ఒకవైపు రబీకి నీటిని విడుదల చేస్తూనే, నగర ప్రజల తాగునీరు అవసరాలకు, పరిశ్రమలకు కూడా తీసుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. దీనివల్ల వేసవిలో నీటి లభ్యత తగ్గుతుంది. ప్రస్తుతం కురిసిన వర్షాల పుణ్యమా అని వచ్చే రెండేళ్ల వరకూ నగరంలో తాగునీటికి ఇబ్బందిపడే పరిస్థితి తలెత్తకపోవచ్చునని జీవీఎంసీ అధికారులు అంచనా వేస్తున్నారు. నగరానికి అవసరమైన నీటిలో సింహభాగం అందించే ఏలేరు రిజర్వాయర్ గరిష్ఠ సామర్థ్యం 86.56 మీటర్లు కాగా ప్రస్తుతం నీటిమట్టం 85.7 మీటర్లకు చేరింది. ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో అధికారులు రిజర్వాయర్ నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మరో ప్రధాన రిజర్వాయర్ అయిన రైవాడ గరిష్ఠ సామర్థ్యం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 111.37 మీటర్లకు చేరింది. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ గరిష్ఠ సామర్థ్యం 61 అడుగులు కాగా, ప్రస్తుతం 58 అడుగులకు చేరుకుంది. ఇంకా నీటి మట్టం పెరిగితే రిజర్వాయర్‌ను ఆనుకుని ఉన్న ప్రాంతాలు మునిగిపోతాయి కాబట్టి అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇన్‌ఫ్లో ఇంకా కొనసాగితే మంగళవారం నీటిని దిగువకు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. తాటిపూడి రిజర్వాయర్ గరిష్ఠ సామర్థ్యం 297 అడుగులు కాగా ప్రస్తుతం 290.2 అడుగుల మేరు నీరు ఉంది. ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో అధికారులు రిజర్వాయర్ నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ముడసర్లోవ రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 169 అడుగులు కాగా ప్రస్తుతం 163 అడుగులకు చేరింది. గంభీరం రిజర్వాయర్ గరిష్ఠ స్థాయి 126 అడుగులు కాగా ప్రస్తుతం 125 అడుగులకు చేరింది.

జీవీఎంసీకి రూ.15 కోట్లు నష్టం

- నష్టం మరింత పెరిగే అవకాశం

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం ప్రభావంతో నగరంలో మూడు రోజులపాటు కురిసిన భారీవర్షాల వల్ల జీవీఎంసీకి రూ.15 కోట్ల వరకూ ఆస్తి నష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షాల ధాటికి 21 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల గుంతలుపడితే, మరికొన్నిచోట్ల రోడ్లపై పొర లేచిపోయింది. ఇంకొన్నిచోట్ల వర్షం నీరు రోడ్ల పైనుంచి ప్రవహించడంతో కోతకు గురయ్యాయి. వీటిని మరమ్మతు చేసేందుకు కనీసం రూ.12 కోట్లు వరకూ ఖర్చవుతుందని ఇంజనీరింగ్ అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే ఓపెన్ డ్రెయిన్లు రెండు కిలోమీటర్లు మేర దెబ్బతిన్నాయి. వీటిని మరమ్మతు చేసేందుకు రూ.కోటి వరకూ ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. నగరంలో 63 చోట్ల వీధి లైట్లు దెబ్బతిన్నాయి. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటుచేసేందుకు కనీసం రూ.పది లక్షలు వరకూ అవుతాయని అంచనా వేస్తున్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలు, కమ్యూనిటీ హాళ్లు నాలుగు కూలిపోగా, మరికొన్ని దెబ్బతిన్నాయి. వీటివల్ల సుమారు రూ.కోటి వరకూ నష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. కొన్నిచోట్ల ప్రవాహం ధాటికి నీటి సరఫరా పైప్‌లైన్లు దెబ్బతిన్నాయి. వీటిని మరమ్మతు చేసేందుకు రూ.పది లక్షలు అవసరం అవుతాయని అధికారులు చెబుతున్నారు. ఆస్తి నష్టంపై అధికారులు ఇంకా సర్వే చేస్తుండడంతో మరింత పెరిగే అవకాశం ఉందని ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

ఇసుక పక్కదారి

లారీ యజమానులతో అగనంపూడి డిపో గనుల, రెవెన్యూ శాఖ అధికారుల కుమ్మక్కు

- బంధువుల ఆధార్ నంబర్‌లతో ఇసుక బుక్ చేస్తున్న లారీ ఓనర్లు
- పది టన్నులకు డబ్బు చెల్లింపు
- అదనంగా మూడు నుంచి నాలుగు టన్నులు లోడింగ్
- రోజుకు 40 నుంచి 50 టన్నులు అక్రమంగా తరలింపు



అగనంపూడి ఇసుక డిపో

అగనంపూడి, సెప్టెంబరు 9:
అగనంపూడి ఇసుక డిపోలో అవినీతి రాజ్యమేలుతోంది. గనులు, రెవెన్యూ శాఖ అధికారులు లారీ యజమానులతో కుమ్మక్కయ్యారు. బుక్ చేసుకున్న దానికంటే అదనంగా మూడు నుంచి నాలుగు టన్నులు లోడ్ చేసి బయటకు పంపి లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణాలోపం అక్రమార్కులకు వరంగా మారింది. వివరాల్లోకి వెళితే...

అగనంపూడి ఇసుక డిపోలో ఇన్‌చార్జులుగా వ్యవరిసున్న గనుల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో స్థానికంగా గల లారీ యజమానులతో మంచి సంబంధాలు ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ఇసుకకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఇదే అదనుగా భావించిన లారీ యజమానులు విశాఖపట్నం పరిధిలో గల తమ బంధువుల ఆధార్ కార్డులతో ఇసుకను బుక్ చేస్తున్నారు. కేవలం పది టన్నులకు మాత్రమే (టన్నుకు) రూ.1,076 చొప్పున చెల్లిస్తున్నారు. డిపోలో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌తో ముందుగానే మాట్లాడుకుని లారీ నంబరు ఇస్తున్నారు. దీంతో లారీ లోడింగ్‌కు వచ్చిన మరుక్షణమే అనుకున్న మేరకు పది టన్నులకు అదనంగా మూడు నుంచి నాలుగు టన్నులు లోడ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంలో గనులు, రెవెన్యూ అధికారులు భారీగా దోచుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ఇసుకకు భారీగా డిమాండ్ ఉంది. టన్ను రూ.రెండు వేలకు పైగా పలుకుతుంది. దీంతో లారీ యాజమానులు గత పది రోజులుగా తమ బంధువుల ఆధార్ నంబర్లతో ఇసుక బుక్ చేసుకుంటున్నారు. వారు చెల్లించిన సొమ్ముకు అదనంగా మరికొంత ఇసుక అక్రమంగా తీసుకుపోతున్నారు. ఇలా రోజుకు 40 నుంచి 50 టన్నులు అదనంగా బయటకు తరలించినట్టు తెలిసింది. డిపో ప్రారంభించిన నాటికి ఉన్న ఇసుక నిల్వలు, ఇప్పటివరకూ జరిపిన అమ్మకాలు...లెక్కలు బయటకు తీయిస్తే అధికారులు బండారం బయట పడుతుందన్న వాదన వినిపిస్తోంది. సామాన్యుడు ఇసుక కోసం వెళితే సవాలక్ష ప్రశ్నలు వేసి ఇబ్బంది పెట్టే డిపో అధికారులు లారీ యజమానులతో కలిసి వ్యాపారం చేస్తుండడం పట్ల స్థానికులు మండి పడుతున్నారు. గత పది రోజుల నుంచి ఎవరి పేరుతో ఇసుక బుకింగ్ అయిందో...ఆయా వ్యక్తులకు వాస్తవంగా ఇసుక అవసరం ఉందా?, సొంతంగా ఇళ్లు నిర్మిస్తున్నారా?, ఇళ్ల నిర్మాణాలకు జీవీఎంసీ ఇచ్చిన ప్లాన్ అప్రూవల్ కాపీలు పరిశీలిస్తే ఇసుక దొంగల బండారం బయటపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏయూ హాస్టళ్ల ప్రక్షాళనపై దృష్టి

- ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించేందుకు రెక్టార్ ప్రొఫెసర్ కిశోర్‌బాబు నేతృత్వంలో పది మందితో ప్రత్యేక బృందం ఏర్పాటు
- హాస్టళ్లలో బయటి వ్యక్తులు లేకుండా చేయడం, డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు క్యాంపస్‌లోకి రాకుండా చేయడమే లక్ష్యం
- క్యాంపస్‌లో ఉంటే తప్పనిసరిగా విద్యార్థులు ఐడీ కార్డులు ధరించాల్సిందే

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాలను డ్రగ్స్ రహితంగా, ర్యాగింగ్ ఫ్రీక్యాంపస్‌లుగా తీర్చిదిద్దాలన్న రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్ ఆదేశాల అమలుపై ఏయూ అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించారు. వర్సిటీని పూర్తిస్థాయిలో డ్రగ్స్, ర్యాగింగ్ ఫ్రీ క్యాంపస్‌గా తీర్చిదిద్దే చర్యలకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలోనే వర్సిటీలో ఉన్న 40కిపైగా వసతి గృహాల్లో నిత్యం తనిఖీలు నిర్వ హించేందుకు ప్రత్యేక బృందాన్ని వీసీ ప్రొఫెసర్ జి.శశి భూషణరావు ఏర్పాటుచేశారు. అనేక హాస్టళ్లలో నాన్ బోర్డర్స్ ఉంటున్నట్టు, వారి ద్వారా డ్రగ్స్, గంజాయి వంటివి విశ్వ విద్యాలయంలోకి వస్తున్నట్టు అధికారులు గుర్తించారు. వాటికి చెక్ చెప్పాలంటే ఆకస్మిక తనిఖీలు చేయడం ఒక్కటే పరిష్కారంగా భావిస్తున్నారు. ఇందుకోసం రెక్టార్ ప్రొఫెసర్ కిశోర్‌బాబు నేతృత్వంలో ఆయా హాస్టళ్ల వార్డెన్లు, కళాశాల ప్రిన్సిపాల్స్‌తో ప్రత్యేకంగా బృందాన్ని నియమించారు. ఈ బృందం నిత్యం రెండు, మూడు హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేయనున్నది. ఈ తనిఖీలకు వెళ్లిన వెంటనే సదరు బృందంలోని సెక్యూరిటీ సిబ్బంది తలుపులు మూసివేస్తారు. బయట విద్యార్థులు ఉంటే వారిపైనా, వారికి ఆశ్రయం

... మిగతా 6వ పేజీలో

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతి పోస్టు భర్తీకి నోటిఫికేషన్

వీసీ రేస్

- ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం
- ఆశావహుల్లో ఉత్సాహం
- మంత్రులు, సీనియర్ ఎమ్మెల్యేల సిఫారసులతో రంగంలో పలువురు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయానికి పూర్తిస్థాయి వైస్ చాన్సలర్‌ను నియమించేందుకు ఉన్నత విద్యా శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఉన్నత విద్యా శాఖ 17 విశ్వవిద్యాలయాలకు ఇన్‌చార్జి వీసీలను నియమించింది. ఏయూ ఇన్‌చార్జి వీసీ పోస్టు కోసం పలువురు సీనియర్ ప్రొఫెసర్లు పోటీపడ్డారు. అయితే ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉన్న ప్రొఫెసర్ జి.శశిభూషణ్‌ను నియమిస్తూ ఉన్నత విద్యా శాఖ ఆదేశాలు జారీచేసింది. ఇన్‌చార్జిని నియమించడంతో పూర్తిస్థాయి వీసీ నియామక ప్రక్రియ చేపట్టేందుకు కనీసం ఆరు నెలలు నుంచి ఏడాది సమయం పడుతుందని అంతా భావించారు. అయితే అనూహ్యంగా ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 28వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకునేందుకు గడువిచ్చింది. దీంతో మరోసారి ఆశావహులు తమ ప్రయత్నాలు మొదలెట్టారు. రాష్ట్రంలోనే అతిపెద్ద విశ్వవిద్యాలయం కావడంతో వీసీ పోస్టు కోసం యత్నిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది.

చరిత్రలో ప్రత్యేక గుర్తింపు

దేశంలోని అతిపురాతన విశ్వవిద్యాలయాల్లో ఆంధ్ర విశ్వ విద్యాలయం ఒకటి. వచ్చే ఏడాది నుంచి వందేళ్ల ఉత్సవాలు ఏడాదిపాటు జరగనున్నాయి. పూర్తిస్థాయి వీసీగా ఎవరు నియమింపబడతారో వారి ఆధ్వర్యంలోనే వందేళ్ల ఉత్సవాలు జరగనున్నాయి. ఇది వీసీగా నియమితులైన వారికి ప్రత్యేక గుర్తింపును తీసుకువస్తుంది. అందుకే ఎలాగైనా వీసీ పోస్టు దక్కించుకోవాలని చాలామంది ప్రయత్నాలు సాగిస్తున్నారు.

జాబితా పెద్దదే..

ఏయూ వీసీ పోస్టు కోసం యత్నిస్తున్న వారి జాబితాలో చాలామంది పేర్లు వినిపిస్తున్నాయి. మంత్రులు, సీనియర్ ఎమ్మెల్యేల సిఫార్సులతో సుమారు డజను మంది ఈ పోస్టు కోసం యత్నిస్తున్నారు. ఈ జాబితాలో ప్రస్తుత ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావు కూడా ఉన్నారు. వీరితోపాటు మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు, ఏయూ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు, శ్రీకాకుళం యూనివర్సిటీ వీసీగా పనిచేసి, ప్రస్తుతం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ రాంజీ, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా పనిచేసి ప్రస్తుతం కంప్యూటర్ సైన్స్ విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ వల్లీ కుమారి, ఇదే విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న శశి పేర్లు వినిపిస్తున్నాయి. వీరితోపాటు బయట వర్సిటీల్లో పనిచేస్తున్న మరో ఇద్దరి పేర్లు, ఇక్కడ కామర్స్ విభాగంలో పనిచేసి పదవీ విరమణ చేసిన ప్రొఫెసర్ సుదర్శనరావు, ఫిజిక్స్ డిపార్టుమెంట్‌కు చెందిన చంద్రమౌళి, దూర విద్యాకేంద్రం డైరెక్టర్‌గా పనిచేసిన ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు పేర్లు వినిపిస్తున్నాయి. సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుంటే మాత్రం అనూహ్యంగా కొత్త ముఖాలు తెరపైకి వచ్చే అవకాశం ఉందంటున్నారు.

నిమజ్జనోత్సవం


- సందడిగా మారిన బీచ్‌లు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన జీవీఎంసీ

వినాయక ఉత్సవాల్లో త్రిరాత్రులు గడిచిపోవడంతో కొంత మంది ప్రతిమలను నిమజ్జనం చేస్తున్నారు. దీంతో తీర ప్రాంతం సందడిగా మారింది. రుషికొండ, సాగర్‌నగర్, ఐటీ హబ్, జోడుగుళ్లపాలెం, కోస్టల్ బ్యాటరీ ప్రాంతాల్లో సోమవారం భక్తులు వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు. ఇందుకోసం జీవీఎంసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. క్రేన్‌లు, గజ ఈతగాళ్లను సిద్ధం చేసింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి మేళతాళాలు, భక్తిశ్రద్ధలతో వినాయక ప్రతిమలను తీరానికి తోడ్కొని వచ్చిన భక్తులు సముద్రంలో నిమజ్జనోత్సవం పూర్తిచేశారు. నిమజ్జన ఏర్పాట్లను మెరైన్ ఎస్పీ రవివర్మ పరిశీలించారు. - సాగర్‌నగర్



కేజీహెచ్ సూపరింటెండెంట్ పోస్టుకు పోటీ

- ఇద్దరికి ఉత్తరాంధ్రకు చెందిన ఓ సీనియర్ మంత్రి సిఫారసు లేఖలు
- అందులో ఒకరు గతంలో వైసీపీ ముఖ్య నాయకులతో సన్నిహితంగా మెలగారనే విమర్శలు
- పోటీలో మరో ముగ్గురు....
- నగరానికి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల ద్వారా ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద ప్రయత్నం



విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌కు పూర్తిస్థాయి సూపరింటెండెంట్‌ను నియమించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందన్న ప్రచారం నేపథ్యంలో పలువురు సీనియర్ వైద్యులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇద్దరు సీనియర్ వైద్యులకు ఉత్తరాంధ్రకు జిల్లాకు చెందిన ఒక సీనియర్ మంత్రి సిఫారసు లేఖలు ఇచ్చినట్టు చెబుతున్నారు. వీరిలో ఒకరు శ్రీకాకుళం జిల్లాలో, మరొకరు ఆంధ్ర మెడికల్ కళాశాలలో పనిచేస్తున్నారు. అయితే, వారిద్దరిలో ఒకరికి లేఖ ఇవ్వడంపై మాత్రం వైద్య వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతలతో సన్నిహితంగా మెలిగిన వారికి కూటమి ప్రభుత్వంలో సిఫారసు లేఖ ఇవ్వడం పట్ల విస్మయం వ్యక్తమవుతోంది. గతంలో వైసీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జులుగా వ్యవహరించిన విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి చుట్టూ తిరిగిన వారికి సిఫారసు లేఖ ఎలా ఇస్తారంటూ కూటమి ప్రభుత్వానికి సానుభూతిపరులుగా ఉన్న కొందరు వైద్యులు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లేందుకు పలువురు వైద్యులు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ఇక, మరో మంత్రి, స్పీకర్ ద్వారా మరో ఇద్దరు వైద్యులు సూపరింటెండెంట్ పోస్టు కోసం యత్నాలు సాగిస్తున్నారు. ప్రస్తుత సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద కూడా నగర పరిధిలోని ఇద్దరు సీనియర్ ఎమ్మెల్యేల ద్వారా తన ప్రయత్నాలను చేసుకుంటున్నారు. ప్రస్తుతం శివానంద అదనపు పూర్తిస్థాయి సూపరింటెండెంట్ బాధ్యతల్లో కొనసాగుతున్నారు.

కామన్ వెల్త్ చెస్ టోర్నీలో అఖిల్‌ప్రసాద్‌కు పతకాలు


పతకాలతో అఖిల్‌ప్రసాద్

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 9: ప్రతిష్టాత్మక కామన్ వెల్త్ యూత్ చెస్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన చిన్నారి అఖిల్ ప్రసాద్ రెండు రజత పతకాలు సాధించాడు. శ్రీలంకలో జరిగిన ఈ టోర్నీలోఅండర్-12 బాలుర విభాగంలో భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించిన అఖిల్ ప్రసాద్ అద్భుతంగా రాణించి క్లాసిక్ ఈవెంట్‌లో 6.5 పాయింట్లతో రజత పతకం, ర్యాపిడ్ ఈవెంట్‌లో 5.5 పాయింట్లతో రజతం సొంతం చేసుకున్నాడు. శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ఏడవ తరగతి చుదువుతున్న అఖిల్ ప్రసాద్...ప్రస్తుత రేటింగ్ 1582 కాగా, ఈ టోర్నీలో సాధించిన విజయాలతో మరో 79.2 పాయింట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. అఖిల్ ప్రసాద్‌ను జిల్లా చెస్ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ రంగాల బాబూరావు, మణికంఠరావు, ఉమామహేశ్వరరావు తదితరులు అభినందించారు.

నైట్ షెల్టర్లలో సమస్యల పరిష్కారానికి వినతి


గండి బాబ్జీకి వినతి పత్రం అందిస్తున్న ఏయూటీడీ సిబ్బంది

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 9: ఏయూటీడీ నిర్వహిస్తున్న డే, నైట్ హోం షెల్టర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు టీడీపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షుడు గండి బాబ్జీని కోరారు. ఈ మేరకు సోమవారం ఏయూటీడీ సిబ్బంది బాబ్జీకి వినతి పత్రం సమర్పించారు. షెల్టర్ల ప్రాముఖ్యతను వివరించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 32వ వార్డు అధ్యక్షుడు మహేష్, ఏయూటీడీ సిబ్బంది కె.జ్యోతిర్మయి, భాస్కరరావు, లీలావతి, శ్రీనివాస్, ధనలక్ష్మి, శాంతి, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఐటీఐ అభ్యర్థులకు అప్రంటీస్ మేళా రేపు

కంచరపాలెం, సెప్టెంబరు 9: కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో ఈనెల 11వ తేదీన ఐటీఐ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులకు అప్రంటీస్ మేళాను నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్, జోన్-1 ఉపసంచాలకులు ఆర్.వి. రమణ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నేషనల్ అప్రంటీస్ మేళాలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, కార్పెంటర్, వెల్డర్, టర్నర్, మెషినిస్టు, ఆర్ &ఏసీ, ఎలక్ట్రానిక్ మెకానిక్, మేషన్. డీఎం తదితర కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనవచ్చు. ప్రభుత్వ రంగ సంస్థలు ఈస్ట్ కోస్ట్ రైల్వే, హిందుస్థాన్ షిప్‌యార్డుతోపాటు 10 ప్రైవేటు కంపెనీలు పాల్గొననున్నాయన్నారు. అర్హత గల అభ్యర్థులు 11వ తేదీ ఉదయం 9గంటలకు కంచరపాలెంలో ప్రభుత్వ పాత ఐటీఐ వద్దకు బయోడేటా, అన్ని ధ్రువపత్రాలతో రావాలని కోరారు.

రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీకి జిల్లా జట్టు

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 9: ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ నిర్వహించిన అండర్ - 9 ఓపెన్, బాలికల జిల్లా జట్టు ఎంపిక పోటీలు సోమవారం ముగిశాయి. నగరంలోని ఓ స్కూల్‌లో జరిగిన ఈ టోర్నీ ఓపెన్ కేటగిరిలో అశ్విని అరవపల్లి, కె. వెంకట కీర్త...బాలికల విభాగంలో బందం కోమలిక, సిరిసిపిల్లి లాశ్రిత ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించారు. ఈ చిన్నారులు ఈనెల 21 నుంచి విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి చెస్ చాంపియన్‌షిప్ టోర్నీలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్టు ఆల్ విశాఖ చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రంగాల బాబూరావు తెలిపారు.

జనసేన పార్టీ కార్యాలయ ఆవరణలో దీపారాధన


దీపాలను వెలిగిస్తున్న వీరమహిళలు

సీతంపేట, సెప్టెంబరు 9: సీతంపేటలోని జనసేన పార్టీ నగర కార్యాలయంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం జనసేన వీరమహిళలు పూజలు నిర్వహించారు.అనంతరం పందిరి వద్ద దీపారాధన చేశారు. కోలాటం తదితర సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి ఒకరోజు టోకెన్ సమ్మె

- జీతాలు పెంచాలని జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ నీటిసరఫరా విభాగం కార్మికుల డిమాండ్


సమ్మెలో పాల్గొన్న నీటి సరఫరా విభాగం అవుట్‌సోర్సింగ్ కార్మికులు

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ నీటి సరఫరా విభాగంలోని అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్లు, లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం విధులను బహిష్కరించి ఒకరోజు టోకెన్ సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎం.ఆనందరావు మాట్లాడుతూ నీటి సరఫరా, యూజీడీ, పంప్‌హౌస్‌లతోపాటు వాటికి అనుసంధానంగా ఉన్న ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కార్మికులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయకపోవడంతో ఒక రోజు సమ్మెకు దిగామన్నారు. అన్‌స్కిల్డ్ వారికి నెలకు రూ.25,410, సెమీస్కిల్డ్ వారికి రూ.29,610 వేతనం చెల్లించేందుకు వీలుగా 2023 జూన్‌లో జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదించిందన్నారు. దీనిపై ప్రభుత్వం అధికారుల కమిటీని ఏర్పాటుచేయగా కమిటీ కూడా ప్రజారోగ్యం విభాగంలో పారిశుధ్య సూపర్‌వైజర్లు, వర్కర్‌కమ్ డ్రైవర్లను వివిధ కేటగిరీలుగా విభజించి, వేతనాలను నిర్ణయిస్తూ ఈ ఏడాది ఫిబ్రవరిలో నివేదిక అందజేసిందన్నారు. కానీ ఇంతవరకూ కార్మికుల జీతాలను పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు కొంతమంది అధికారులు, యూనియన్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని ప్రభుత్వం సాకులు చెబుతోందన్నారు. జీవీఎంసీలో అభివృద్ధి పనులుచేసే కాంట్రాక్టర్లకు ఇచ్చే ఎస్ఎస్ఆర్ రేట్లలో ప్లంబర్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్లకు రూ.750 వరకూ చూపిస్తున్న అధికారులు నీటిసరఫరా విభాగం కార్మికులకు వేతనాలను చెల్లించకుండా వివక్ష చూపుతున్నారన్నారు. కార్మికుల సమస్య పరిష్కారం కాకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు సత్యం, శ్రీనివాసరావు, మోహన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ను వ్యూహాత్మక రంగంలో కొనసాగించాలి

- విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలి
- స్టీల్‌ప్లాంటు అధికారుల సంఘం డిమాండ్

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం బ్యాంకింగ్, బీమా, పవర్, సిమెంట్ తదితర రంగాలను వ్యూహాత్మక రంగంలోను, స్టీల్‌ను వ్యూహాత్మకం కాని (నాన్ స్ట్రాటజిక్) రంగంగాను గుర్తించి పెట్టుబడుల ఉపసంహరణకు నిర్ణయించిందని, ఆ కారణంగానే విశాఖ ఉక్కును విక్రయించాలని చూస్తున్నారని, తక్షణమే దీనిని ఉపసంహరించుకోవాలని విశాఖ స్టీల్ అధికారుల సంఘం డిమాండ్ చేసింది. విశాఖ పౌర గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్ మాట్లాడుతూ, స్టీల్ అనేది నిత్యావసర వస్తువు అని ప్రతి రంగంలోను దాని అవసరం ఉందని, అటువంటి దానిని వ్యూహాత్మకం కాని రంగంగా నిర్ధారించడం తగదన్నారు. వెంటనే కేంద్రం తన నిర్ణయం మార్చుకొని స్టీల్‌ను కూడా ప్రాధాన్య రంగంలోని మార్చాలని డిమాండ్ చేశారు. ఒకవైపు వ్యూహాత్మకం కాదంటూనే మరోవైపు సెయిల్‌ను లక్ష కోట్ల రూపాయలతో విస్తరించాలని ఆదేశించిందని, ఇటు వైపు విశాఖ ఉక్కును విక్రయించాలని చూస్తోందన్నారు. విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. దీనివల్ల విశాఖ ఉక్కుకు ముడి పదార్థాలు, నిధుల కొరత తీరుతుందన్నారు. ఢిల్లీలో మంగళ, బుధవారాల్లో ఉన్నత స్థాయి సమావేశాలు జరుగుతున్నాయని, అక్కడ ఈ రెండింటిపై నిర్ణయాలు తీసుకుంటే విశాఖ ఉక్కు సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. గత రెండేళ్లుగా విశాఖ ఉక్కులో 50 శాతం ఉత్పత్తే జరుగుతున్నదని, దీనివల్ల రూ.17 వేల కోట్ల యంత్ర పరికరాలు నిర్వీర్యం అయిపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేకపోతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు మార్పూరు శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి మల్లయ్య, ఓబీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీవో 115ను రద్దు చేయాలి


నిరసన వ్యక్తంచేస్తున్న కేజీహెచ్‌లోని నర్సులు

మహారాణిపేట, సెప్టెంబరు 9: తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ కేజీహెచ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ నర్సులు ఆందోళన చేపట్టారు. సోమవారం కేజీహెచ్ పరిపాలన ద్వారం ఎదుట ఈ మేరకు నిరసన వ్యక్తంచేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జారీ చేసిన జీవో 115 ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇంటెన్సిఫైడ్ శిక్షణ తీసుకున్న వారికి స్టాఫ్ నర్సు పోస్టుల కేటాయింపును వ్యతిరేకిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అత్యవసర విధుల్లో పాల్గొంటూ, జీవో రద్దు కోసం దశల వారీగా తమ ఆందోళనను కొనసాగిస్తామని హెచ్చరించారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

అల్లిపురం, సెప్టెంబరు 9: జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సోమవారం జర్నలిస్టుడే సందర్భంగా 32వవార్డులోని నేరెళ్లకోనేరు వద్దనున్న జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నేత, కార్పొరేటర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో నగరానికి చెందిన 60 మంది జర్నలిస్టులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు తాను కృషి చేస్తానన్నారు. పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బీజేపీ ఎమ్మెల్యేలు వేతనం


ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కలిసిన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, సెప్టెంబరు 9: ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు, వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని మర్యాద పూర్వకంగా కలిశారు. బీజేపీ తరఫున ఉన్న ఎనిమిది మంది ఎమ్మెల్యేలు తమ ఒక నెల వేతనాన్ని విజయవాడ వరద బాధితుల సహాయార్థం అందిస్తున్నట్టు విష్ణుకుమార్ రాజు సీఎంకు ఈ సందర్భంగా తెలిపారు.

మురళీనగర్ వాకర్స్ క్లబ్ సాయం

మురళీనగర్ ; విజయవాడ వరద బాధితుల సహాయార్థం మురళీనగర్‌లోని వాకర్స్ క్లబ్ సభ్యులు సోమవారం విరాళాన్ని అందజేశారు. క్లబ్ సభ్యులు, దాతలనుంచి సేకరించిన మొత్తం రూ. 75,116 చెక్కు రూపంలో సీఎం సహాయ నిధికి అందజేసినట్టు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా.చంద్రమౌళి తెలిపారు. సోమవారం ఈచెక్‌ను స్థానిక యూనియన్ బ్యాంకు మేనేజర్‌కు అందజేశారు. వాకర్స్‌క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు, కోశాధికారి జె.కూర్మారావు ఉన్నారు.


చెక్కును బ్యాంకు మేనేజర్‌కు అందిస్తున్న క్లబ్ సభ్యులు

ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే ధ్యేయం

- క్రీడా భారతి ప్రచార కమిటీ ప్రతినిధి ప్రసాద్ మహంకర్


మాట్లాడుతున్న ప్రసాద్ మహంకర్

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 9: క్రీడా భారతి సహకారంతో అనేక మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదిగినట్టు క్రీడా భారతిజాతీయ ప్రచార కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్ మహంకర్ పేర్కొన్నారు. సోమవారం విశాఖలో పర్యటించిన ఆయన స్థానిక క్రీడా భారతి ప్రతినిధులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లతో సమావేశంపై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా భారతి అనేది ఒక క్రీడాంశానికి చెందిన సంఘం కాదని, సామాజిక సేవా సంస్థని తెలిపారు. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించి వారిని ఉన్నతస్థాయిలో తీర్చిదిద్దడమే తమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఇకపై, జాతీయ స్థాయి టోర్నీల్లో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ. లక్ష, ద్వితీయ స్థానానికి రూ.50 వేలు, తృతీయ స్థానానికి రూ.30 చొప్పున బహుమతులందించనున్నామన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్నత స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు నిపుణులైన కోచ్‌లు అవసరమని, ఆ దిశగా స్థానిక క్రీడాభారతి ప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, మాజీ ఒలింపియన్ ఎం.వి.మాణిక్యాలు, రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వీఐపీల భద్రతపై పీఎస్‌వోలకు శిక్షణ

మహారాణిపేట, సెప్టెంబరు 9: వీఐపీల భద్రత కోసం పీఎస్‌వోలకు శిక్షణ కార్యక్రమాన్ని పోలీసు కమిషనర్ శంఖబ్రాత బాగ్చీ సోమవారం సిటీ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఐపీలకు భద్రతా విధులు నిర్వహించే పీఎస్‌వోలు పారదర్శకత, శారీరక దారుఢ్యంతో ఉండాలన్నారు. ఈ అర్హతలతో ఎంపిక చేసిన కానిస్టేబుళ్ల ఈనెల 28 వ తేదీ వరకు శిక్షణ అందించనున్నట్టు చెప్పారు.

వరద బాధితులకు కూరగాయలు


కూరగాయలతో సీతమ్మధార రైతుబజార్ రైతులు

సీతమ్మధార: విజయవాడలో వరద బాధితుల కోసం సీతమ్మధార రైతుబజార్‌లో రైతులు రెండు వేల కిలోల కూరగాయలను సేకరించారు. బజార్ ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకుడు సతీష్ వీటిని సమకూర్చారు. కలెక్టర్ ఏర్పాటు చేసిన వాహనంలో విజయవాడ తరలించారు.

అక్కయ్యపాలెం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం 45వ వార్డు నరసింహనగర్ రైతుబజారులో వ్యాపారాలు సాగిస్తున్న రైతులు 360 కిలోల కూరగాయలను అందించారు. రైతుబజారు ఎస్టేట్ అధికారి పి.చిన్నబాబు, సహాయకుడు ఆర్. సత్యనారాయణ ఆధ్వర్యంలో వీటిని విజయవాడకు వ్యాన్‌లో పంపించారు.

వాడవాడలా వినాయక ఉత్సవాలు


త్రిముఖ గణపతి అవతారంలో దర్శనమిస్తున్న దుర్గాగణపతి


గవరకంచరపాలెంలో కొలువుదీరిన గణనాథుడు

జ్ఞానాపురం, సెప్టెంబరు 9: నగరంలోని కాన్వెంటు కూడలిలోని సౌభాగ్యగణపతి ఆలయం వద్ద వైష్ణవి హోల్‌సేల్ వెజిటేబుల్ మార్కెట్ వర్తకసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 16 అడుగుల గణపతిని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీటితో పాటు జ్ఞానాపురంలోని పలు మండపాలను ఆయన సందర్శించారు. గవరకంచరపాలెంలోని యంగ్ బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి ఉత్సవాలు జరుపుతున్నారు.

త్రిముఖ గణపతి అవతారంలో....

సీతంపేట: సీతంపేట దుర్గాగణపతి ఆలయంలో ఆలయ ఈఓ రమాభాయి, ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి గోవింద్ పర్యవేక్షణలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మూడోరోజు సోమవారం దుర్గాగణపతి త్రిముఖ గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి గణపతి హోమం, పంచామృతాలతో అభిషేకాలను అర్చకులు నటరాజన్ స్వామి ఆధ్వర్యంలో చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

కొండవాలు ప్రాంతాల్లో 12,750 కుటుంబాలు

... 5వ పేజీ తరువాయి

అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తాటిపూడి రిజర్వాయర్ నుంచి నీటి విడుదల, వర్షాలకు గోస్తనీలో వరద ప్రవాహం పెరిగినందున పద్మనాభం, భీమిలి మండలాల్లో తీర గ్రామాలను అప్రమత్తం చేశామన్నారు. జిల్లాలో పలుచోట్ల రోడ్లు దెబ్బతిన్నాయని, దీనిపై శాఖల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. వాయుగుండం ఏర్పడక ముందు విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లిన 30 బోట్లు సురక్షితంగా గోపాల్‌పూర్‌లో ఒడ్డుకు చేరుకున్నాయని, ఈ మేరకు సంబంధిత జిల్లా కలెక్టర్‌తో మాట్లాడామన్నారు. వర్షాలకు అక్కడక్కడా ప్రహరీ గోడలు, పాఠశాల గోడలు కూలాయని కలెక్టర్ తెలిపారు. విజయవాడ వరద బాధితులకు రెండున్నర లక్షల ఆహార పొట్లాలు, లక్షన్నర లీటర్ల పాలు, రెండు లక్షల వాటర్ బ్యాటిళ్లు పంపించామన్నారు. విజయవాడలో విధులు నిర్వహణకు 1,000 మంది పారిశుధ్య సిబ్బందిని పంపించామని, నేవీ నుంచి బోట్లు వెళ్లాయని కలెక్టర్ పేర్కొన్నారు.

ఏయూ హాస్టళ్ల ప్రక్షాళనపై దృష్టి

... 5వ పేజీ తరువాయి

ఇచ్చిన విద్యార్థులపైనా చర్యలు తీసుకోనున్నారు. అదే సమయంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషిచేస్తారు.

నాన్ బోర్డర్స్‌తో ఇబ్బందులు

వర్సిటీలోని 40కిపైగా హాస్టళ్లలో సుమారు ఎనిమిది వేల మంది వరకు విద్యార్థులు ఉంటున్నారు. అనేక హాస్టళ్లలో నాన్ బోర్డర్స్ ఎక్కువగా ఉంటున్నారు. తనిఖీల ద్వారా వారికి చెక్ చెప్పాలని అధికారులు భావిస్తున్నారు. దీనివల్ల హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు కూడా ఇబ్బందులు తప్పుతాయని అధికారులు పేర్కొంటున్నారు. నాన్ బోర్డర్స్ ఉండడం వల్ల జూనియర్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది.

ఐడీ కార్డు తప్పనిసరి

విద్యార్థులు వర్సిటీలో ఉన్న సమయంలో తప్పనిసరిగా మెడలో ఐడీ కార్డు ధరించాలన్న నిబంధనను అధికారులు తీసుకువచ్చారు. తరగతికి వచ్చినప్పుడు తప్పనిసరిగా విద్యా ర్థులు ఇకపై ఐడీ కార్డు ధరించాలి. అలాగే, హాస్టల్ విద్యార్థులు వర్సిటీలో, బయటకు వెళ్లి హాస్టల్‌లోకి వచ్చి నప్పుడు ఐడీ కార్డును ధరించాలని అధికారులు ఆదే శించారు. ఐడీ కార్డు ధరించని విద్యార్థిని అనుమతించవద్దని సెక్యూరిటీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మెస్‌లో భోజనం పెట్టేటప్పుడు కూడా తప్పనిసరిగా విద్యార్థులు ఐడీ కార్డును పరి శీలించాల్సిందిగా వార్డెన్లకు ఆదేశాలు అందాయి. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగేలా చేసేందుకు, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు ఈ ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్టు రెక్టార్ ప్రొఫెసర్ కిశోర్‌బాబు తెలిపారు. ప్రతిరోజూ మూడు నుంచి నాలుగు హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

సాహితీ కోవిదుడు 'బులుసు'


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సన్నిధానం నరసింహ శర్మ, తదితరులు

సీతంపేట, సెప్టెంబరు 9: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి స్మారక సమితి ఆధ్వర్యంలో విద్వాన్ బులుసు సీతారామ శాస్త్రి జయంతి సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 'పలుకుల భారతి స్ఫూర్తి...విద్వాన్ బులుసు సీతారామ శాస్త్రి' పేరిట కల్లూరి విజయలక్ష్మి సంకలనం చేసిన పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డీవీ సూర్యారావు అధ్యక్షతన జరిగిన సభలో సన్నిధానం నరసింహ శర్మ చేతుల మీదుగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బులుసు సీతారామ శాస్త్రి ఘనతను వివరించారు. వేదపండితుడిగా, వీరేశలింగం విద్యాలయ తెలుగు అధ్యాపకులుగా, హోమియో వైద్యునిగా రాజమహేం ద్రవరానికి వన్నె తెచ్చారని తెలిపారు. విశ్రాంత ఆచార్యులు, కవి డాక్టర్ కొచ్చర్లకోట సత్యనారాయణ, శాస్త్రి కుమారులు బులుసు అనంత రామయ్య, దుర్గాప్రసాద్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు అస్వస్థతపై ఫిర్యాదు

మహారాణిపేట, సెప్టెంబరు 9: తన భార్య అస్వస్థత పాలవడడానికి ఓ ఐవీఎఫ్ సెంటర్ కారణమంటూ ఆమె భర్త త్రి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసుకు సంబంధించి వివరాలివి.. సబ్బవరానికి చెందిన పి. ససింద్రి కుమార్, రోజా దంపతులకు పిల్లలు లేకపోవడంతోరామ్‌నగర్ సమీపంలో ఒయాసిస్ ఐవీఎఫ్ సెంటర్‌లో కొద్దిరోజుల కిందట వైద్య పరీక్షలుచేయించారు.స్కానింగ్ అంతా నార్మల్‌గా ఉందని అక్కడి వైద్యులు పంపించారు. ఈ క్రమంలో ఈనెల 4 వ తేదీన అర్ధరాత్రి రోజాకు తీవ్రమైన కడుపు నొప్పి రావటంతో హుటాహుటీన సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. ఆమెకు గర్భ ధారణ జరిగి అది విచ్ఛిత్తి జరిగినట్టు గుర్తించి అత్యవసర శస్త్ర చికిత్స నందించారు. ప్రస్తుతం రోజా అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నా రు. ఈ స్థితిలో ఆమె భర్త ఐవీఎఫ్ సెంటర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు.


అవసరమైన వైద్య పరీక్షలు చేశాం

మా ఆసుపత్రికి వచ్చిన రోజాకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాం. ఆమెకు ఎక్టోపిక్ గర్భం ఉన్న విషయం తెలియజేశాం. ఆ వివరాలతో స్కానింగ్ రిపోర్టులనూ అందజేశాం. కానీ, తమ వద్ద ఉన్న రోగి ఫైల్ వివరాలను మాత్రం అందజేయలేదు.

- డాక్టర్ రాధిక, ఒయాసిస్ ఐవీఎఫ్ సెంటర్ నిర్వాహకులు

లోతట్టు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

కొండచరియలు విరిగిపడిన ప్రాంతం పరిశీలన


గోపాలపట్నం రామకృష్ణానగర్‌లో కొండచరియలు జారిపడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

గోపాలపట్నం, సెప్టెంబరు 9: గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో ముంపు, లోతట్టు, కొండవాలు ప్రాంతాల్లో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సోమవారం పర్యటించారు. వర్షంతో రామకృష్ణానగర్‌లో కొండచరియలుజారిపడిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ ప్రాంతంలో ప్రమాదకర ప్రదేశాలను పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు కలెక్టర్‌కు చూపించారు. అనంతరం కొత్తపాలెం శివారులోని ముంపు ప్రాంతాలను కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. వర్షాలకురిసే సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులను ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో ముంపు ప్రాంతాల్లో వరద నివారణ చర్యలు చేపట్టాలని రెవెన్యూ, జీవీఎంసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా కొండచరియలు జారిపడే ప్రమాదముంటే ముందుగానే నివాసితులను పునరావాస కేంద్రాలకు తరలించాలని, అక్కడ వారికి అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే కొండచరియలు జారిపడకుండా చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట రెవెన్యూ, జీవీఎంసీ, పోలీస్ అధికారులున్నారు.

వర్షం మిగిల్చిన నష్టం

» విరిగిపడిన కొండచరియలు » పలుచోట్ల కుప్పకూలిన గృహాలు

» ఆయా ప్రాంతాల్లో పర్యటించిన ప్రజాప్రతినిధులు, అధికారులు



వర్షాలకు మల్కాపురంలో కూలిపోయిన ఇల్లు

మల్కాపురం, సెప్టెంబరు 9: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం పారిశ్రామిక ప్రాంత ప్రజలను భయాందోళనలోకి నెట్టేసింది. పలుచోట్ల కొండచరియలు విరిగిపడగా, మరిన్ని చోట్ల ఇళ్ల గోడలు కూలాయి. గెడ్డల్లో వరద నీరు పొంగి ప్రవహించింది. గ్రేటర్ 59, 60, 62, 63 వార్డుల పరిధిలో ఎక్కువగా కొండలున్నాయి. కొండవాలును ఆవాసాలుగా మార్చుకుని వేలాదిమంది నివసిస్తున్నారు. భారీ వర్షాలతో కొండచరియలు విరిగిపడి వారంతా నిద్రలేని రాత్రులు గడిపారు. కొన్నిచోట్ల మట్టిపెళ్లలు విరిగి మేడలపై పడ్డాయి. ఈ ప్రాంతంలోని కొండలన్నీ గ్రావెల్‌తో నిండి ఉండడంతో భారీ వర్షానికి పలుచోట్ల కోరుకుపోయింది. దీంతో అది దిగువప్రాంతానికి జారి ప్రమాదానికి కారణమవుతోంది. కొండలపై ఆవాసాలు ప్రమాదకరమని, రక్షణ గోడలు నిర్మించాలని గతంలో ఎంతోమంది నిపుణులు సూచించినా, జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో చినుకుపడితే ఈ ప్రాంత వాసులు బిక్కుబిక్కుమంటూ జీవించాల్సిన దుస్థితి ఎదురవుతోంది.

పొంగిపొర్లిన గెడ్డలు

మల్కాపురం, శ్రీహరిపురం, గుల్లలపాలెం ప్రధాన గెడ్డలు పొంగిపొర్లాయి. హెచ్‌పీసీఎల్, కోరమాండల్ కంపెనీల గోడలు వరదనీరు సాఫీగా సాగేందుకు వీలు లేని పరిస్థితిని కల్పించారు. ఆయా ప్రాంతాలకు ఎగువన ఉన్న సుమారు 55 గ్రామాలనుంచి వరద నీరు ఈ గెడ్డల నుంచి హెచ్‌పీసీఎల్ కాలువ గుండా సముద్రంలో కలవాల్సి ఉంది. కానీ గోడల నిర్మాణంలో అడ్డంకులు ఏర్పడ్డాయి. హెచ్‌పీసీఎల్, కోరమాండల్ యజమాన్యాలు చేపట్టిన నిర్మాణాలు దాదాపుగా కాలువలను మూసివేశాయి. దీంతో వరదనీరు దిగువకు వెళ్లే దారిలేక రహదారులపైకి పొంగి ప్రవహించింది. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో ఎమ్మెల్యే గణబాబు పర్యటన

లోతట్టు ప్రాంతాల్లో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు సోమవారం పర్యటించారు. కొండచరియలు విరిగిపడిన ప్రాంతాలను పరిశీలించారు. మల్కాపురం పల్లెవీధిలో కూలిపోయిన డొక్క లక్ష్మి ఇంటిని పరిశీలించి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ కొణతాల జగన్మోహన్ సుధ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

పెంటయ్యనగర్ కొండ పైనుంచి జారిపడిన మట్టిపెళ్లలు

గాజువాక: భారీ వర్షాలకు ఇక్కడి పెంటయ్యనగర్ కొండపై మట్టిపెళ్లలు విరిగిపడ్డాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ఏమీ కాలేదు. గాజువాక ప్రాంతంలో సుమారు పన్నెండు కొండలపై వేలాది కుటుంబాలు నివసిస్తున్నాయి. గతంలో పెంటయ్యనగర్, సింహగిరి కాలనీ కొండలపై కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో ముగ్గురు మృతి చెందడంతో వర్షాల సమయంలో కొండవాలు ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా సోమవారం కొండవాలు ప్రాంతాల్లో కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, జెడ్సీ సన్యాసినాయుడు, పలువురు అధికారులు పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. పెంటయ్యనగర్ కొండ ప్రాంతంలో పలుచోట్ల మట్టిపెళ్లలు పడడాన్ని పరిశీలించారు. ఇంటికి, ఇంటికి మధ్య రిటెయినింగ్ వాల్ నిర్మించుకోవాలని స్థానికులకు వారు సూచించారు.



71వ వార్డులో రిటెయినింగ్ వాల్ కూలిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్



వరద బాధితులతో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గణబాబు

71వ వార్డులో కూలిన రిటెయినింగ్ వాల్

శ్రీనగర్: గ్రేటర్ 71 వార్డు పరిధి శ్రీరామ్ నగర్‌లో ఆదివారం రిటెయినింగ్ వాల్ కూలిపోయింది. టీడీపీ నాయకుడు పప్పు రాజారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, సమాచారాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు సోమవారం ఉదయం తహసీల్దార్ శ్రీవల్లి ఘటనా స్థలిని పరిశీలించి బాధితులకు అండగా ఉంటామన్నారు. భారీ వర్షాల సమయంలో కొండవాలు ప్రాంతాల ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు. ఆమె వెంట టీడీపీ వార్డు ఇన్‌చార్జి పప్పు శంకరరావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ప్రసన్నగిరి పైనుంచి పడిన బండరాళ్లు

అక్కిరెడ్డిపాలెం: తెరిపివ్వని వర్షాలకు బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై నుంచి కొన్ని బండరాళ్లు ఆదివారం రాత్రి రహదారిపై పడ్డాయి. ప్రసన్నగిరిపై గల వేంకటేశ్వర వినాయక స్వామి దేవస్థానం వాహన రహదారి మార్గం వైపు మట్టి కరగడంతో అక్కడ ఉన్న పెద్ద పెద్ద రాళ్లు కిందకు దొర్లుకొచ్చాయి. రాత్రి సమయంలో రాళ్లు పడడంతో ఎవరికీ ఏమీ కాలేదు. సోమవారం ఉదయం దేవస్థానం మాజీ చైర్మన్ గండ్రెడ్డి రామునాయుడుతో పాటు ధర్మకర్తలు పొక్లయినర్‌తో సహాయంతో బండరాళ్లను తొలగించారు. భవిష్యత్తులో పైనుంచి రాళ్లు పడకుండా కొండ చుట్టూ రక్షణ గోడ కట్టాలని దేవస్థానం సిబ్బందితో పాటు పలువురు భక్తులు కోరుతున్నారు.

వరద బాధితులకు ఎంపీ పరామర్శ

గోపాలపట్నం: వరద ప్రభావంతో స్థానిక లక్ష్మీనగర్ పాఠశాలలో పునరావాసం పొందతున్న కొండప్రాంత వాసులను ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గణబాబు సోమవారం పరామర్శించారు. రామకృష్ణానగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో భారీ వర్షానికి కొండచరియలు జారిపడ్డాయి. ఆయా ప్రాంతాల్లోని ఇళ్లలో నివాసముంటున్న వారిని ముందు జాగ్రత్తగా లక్ష్మీనగర్‌లోని పాఠశాలకు తరలించిన విషయం తెలిసిందే. వారికి అన్ని వసతులు కల్పించాలని ఎంపీ, ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. బాధితులకు అండగా ఉంటామని, అన్ని విధాలా ఆదుకుంటామని భరోసానిచ్చారు.

లక్ష్మీనగర్‌లో ఎమ్మెల్యే పర్యటన

ఎన్‌ఏడీ జంక్షన్: జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ కొండవాలు ప్రాంతాన్ని సోమవారం పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు సందర్శించారు. స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. కొండవాలు నుంచి వచ్చే నీరు నిల్వ ఉండకుండా నివాసితులు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. కొండవాలులో త్వరలోనే రక్షణ గోడ నిర్మాణం, మట్టిపెళ్లలు విరిగిపడకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మాణిక్యం, పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'మేహాద్రిగెడ్డ'ను సందర్శించిన ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: ఎడ తెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మేహాద్రి రిజర్వాయర్‌లోకి భారీగా వరద నీరు చేరింది. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోమవారం రిజర్వాయర్‌ను పరిశీలించి, అధికారులతో కలిసి నీటిమట్టాన్ని పరిశీలించారు. పరీవాహన ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం లేదని అధికారులు ఆయనకు వివరించారు. వరద నీరు పోటెత్తితే గేట్లు తెరవాల్సిన నేపథ్యంలో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ వేణుగోపాల్, జెడ్సీ హైమావతి ఉన్నారు.



బీహెచ్‌పీవీ ప్రసన్నగిరి పైనుంచి జారిపడిన బండరాళ్లను పొక్లెయినర్‌తో తొలగిస్తున్న దృశ్యం



కొండచరియలు పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న గణబాబు



గాజువాకలోని పెంటయ్యనగర్ కొండ పైనుంచి జారిపడిన మట్టిపెళ్లలు



మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

విజయవాడ వరద బాధితులకు నిత్యావసరాల వితరణ

విశాఖపట్నం, సెప్టెంబరు 9: విజయవాడ, పరిసర ప్రాంత వరద బాధితులకు నిత్యావసరాలు, కూరగాయలతో ఓ లారీ సోమవారం బయలుదేరింది. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పచ్చ జెండాను ఊపి లారీని ప్రారంభించారు. వరద బాధితుల సహాయార్థం విశాఖపట్నం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, నగరంలోని అన్ని రైతుబజార్ల రైతులు, వ్యాపారులు, జ్ఞానాపురం న్యూ హోల్‌సేల్ మార్కెట్ వ్యాపారుల సహకారంతో సేకరించిన 10.5 మెట్రిక్ టన్నుల కూరగాయలు, నిత్యావసర సరకులను విజయవాడకు పంపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ శాఖాధికారి షేక్ యాసిన్, ఎస్టేట్ అధికారులు జి.ప్రసాద్, టీవై నాయుడు, వ్యాపారులు వి.పరమేశ్వరరావు, కె.ప్రసాద్, పి.సత్యనారాయణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: స్థానిక రైతుబజార్‌లోని రైతులు విజయవాడ వరద బాధితులకు సహాయం అందజేశారు. ఈ మేరకు సేకరించిన కూరగాయలు, నిత్యావసర సరకులను ప్రత్యేక వాహనంలో విజయవాడ పంపించారు. ఎస్టేట్ అధికారిణి వీఎస్‌పీ షర్మిల జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సహాయకులు చిన్నబ్బాయ్, రైతులు పాల్గొన్నారు.



లారీకి జెండా ఊపుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఎన్‌ఏడీ జంక్షన్: మర్రిపాలెం రైతుబజారులోని రైతులు విజయవాడ వరద బాధితులకు కూరగాయలు పంపించారు. వంద కిలోల బంగాళదుంపలు, 60 కిలోల క్యాబేజీ, 80 కిలోలల అనపకాయలు సేకరించి మార్కెటింగ్‌శాఖ అధికారులకు అందజేసేందుకు వీలుగా ఆటోలు పంపించారు. కార్యక్రమంలో రైతుబజారు ఈఓ వరహాలు, ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.

వినోద్‌నగర్ ఎస్‌ఎల్‌ఎఫ్ సభ్యుల విరాళం

ఎన్‌ఏడీ జంక్షన్: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు వినోదర్‌నగర్ ఎస్.ఎల్.ఎఫ్ డ్వాక్రా గ్రూపు సభ్యులు ముందుకువచ్చారు. ఆర్పీ సంధ్యారాణి ఆధ్వర్యంలో రూ.లక్ష చెక్కును సోమవారం జోన్ ఏపీడీ శ్రీరామ్‌కు అందజేశారు. సభ్యులనుంచి విరాళాలు సేకరించడంలో ఆర్పీ చొరవను ఏపీడీ అభినందించారు. డ్వాక్రా సీవోలు ఝూన్సీ, జగదీశ్వరి, అనంతలక్ష్మి, లలితకుమారి, సంధ్యారాణి, సభ్యులు పాల్గొన్నారు.

గోపాలపట్నం రైతుబజారు నుంచి...

గోపాలపట్నం: విజయవాడ వరద బాధితులకు గోపాలపట్నం రైతుబజారులోని రైతులు కూరగాయలు పంపించారు. తమ వంతు సాయంగా సుమారు నాలుగు క్వింటాళ్ల కూరగాయల్ని సోమవారం పంపించారు. మార్కెటింగ్ శాఖ అధికారులు రైతులను అభినందించారు.

బీసీ రోడ్డులో ఈ-చలానాల డ్రైవ్

పెదగంట్యాడ, సెప్టెంబరు 9: న్యూపోర్టు ట్రాఫిక్ పోలీసులు సోమవారం బీసీ రోడ్డులోని పెదగంట్యాడ జంక్షన్, ఫైర్‌స్టేషన్ కూడలిలో ఈ-చలానా డ్రైవ్ నిర్వహించారు. వాహనాలను ఆపి చలానాలు పెండింగ్‌లో ఉంటే జమ చేయించారు. ఏఎస్‌ఐలు ఉమామహేశ్వరరెడ్డి, రాము, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



కొండారెడ్డి (ఫైల్ ఫొటో)

గాజువాక, సెప్టెంబరు 9: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాల మేరకు జోగవానిపాలెం ప్రాంతానికి చెందిన రామారెడ్డి మాల కొండారెడ్డి (70) పెయింట్లు కొనేందుకు సోమవారం స్నేహితుడు కోటేశ్వరరావుతో కలిసి ద్విచక్ర వాహనంపై జగ్గు జంక్షన్ వెళ్లారు. తిరిగి వస్తుండగా సిగ్నల్ వద్ద గోతిలో పడిపోయారు. అదే సమయంలో వేగంగా వచ్చిన లారీ చక్రాల కింద మాలకొండారెడ్డి పడిపోయాడు. ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు.

స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 9: స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ ఢిల్లీలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమరస్వామికి స్టీల్‌ప్లాంట్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, బీఎస్.రాజు సోమవారం వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ కొన ఊపిరితో ఉందని, తక్షణ సహాయంగా పది వేల కోట్లు ఇవ్వాలని కోరారు. ప్లాంట్‌కు పూర్తిస్థాయి ముడి పదార్థాలు అందజేయాలని విన్నవించారు. నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని కోరారు.

ఉక్కును పూర్తి సామర్థ్యంతో నడపాలని ధర్నా

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంటును 7.3 మిలియన్ టన్నుల పూర్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద గుర్తింపు యూనియన్ నాయకులు ఆందోళన చేశారు. యూనియన్ అధ్యక్షుడు కేఎస్‌ఎన్ రావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిస్థితి ఇబ్బందికరంగా మారిందన్నారు. ముడిసరకు లేక ఉత్పత్తి కుంటుపడిందన్నారు. జీతాలు కూడా సకాలంలో ఇవ్వలేని దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం సీజీఎం (వర్క్స్) యు.శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జె.రామకృష్ణ, మసేన్‌రావు, అప్పారావు, నరసింగరావు, నరేశ్‌కుమార్, పరంధామయ్య, మహాలక్ష్మినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సెయిల్‌లో విలీనం చేయాలి

స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలని ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య కోరారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ప్లాంట్ పరిపాలన భవనం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కును ప్రైవేటీకరిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వ రంగంలో కొనసాగితేనే అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందన్నారు. ధర్నాకు ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బి.అప్పారావు, బి.తౌడన్న, ఎస్.శ్రీనివాసరావు, మోహన్‌బాబు, పుల్లారావు, కార్మిక నాయకులు జె.అయోధ్యరామ్, డి.ఆదినారాయణ, కేఎస్‌ఎన్ రావు, తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర ఉక్కుశాఖా మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నేతలు


కైలాసగిరిపై అదుపుతప్పిన ట్రావెల్స్ బస్సు



గాయపడిన మహిళను పరామర్శిస్తున్న సీపీ

ఎండాడ, సెప్టెంబరు 9: కైలాసగిరిపై ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి కొండవాలును ఢీకొనడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ వెంకట్రావుతో పాటు స్థానికులు తెలిపిన వివరాలివి.. ట్రావెల్స్‌కి చెందిన బస్సు పశ్చిమ బెంగాల్‌కు చెందిన 18 మంది పర్యాటకులతో సోమవారం కైలాసగిరికి వచ్చింది. డౌన్‌లో బస్సు పార్కింగ్ చేసి ఉండగా, ఒకేసారి పర్యాటకులు వేగంగా ఎక్కడంతో హ్యాండ్ బ్రేక్ వదులై న్యూట్రల్‌కి వచ్చేసింది. దీంతో కదిలింది. కింద ఉన్న డ్రైవర్ అప్రమత్తమై వెంటనే బస్సు ఎక్కి పక్కనున్న కొండవాలను ఢీకొట్టాడు. దీంతో కొంతమందికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని మరో బస్సులో కేజీహెచ్‌కి తరలించారు. క్షతగాత్రులను సీపీ శంఖబ్రత బాగ్చి పరామర్శించారు.

దువ్వాడ ట్రాఫిక్ సీఐగా వెంకటరావు



కూర్మన్నపాలెం, సెప్టెంబరు 9: దువ్వాడ ట్రాఫిక్ సీఐగా కె.వెంకటరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2004 బ్యాచ్ ఎస్‌ఐగా చేరిన ఆయన, 2019లో సీఐగా పదోన్నతి పొందారు. దువ్వాడ, స్టీల్‌ప్లాంట్ స్టేషన్ల పరిధిలో ట్రాఫిక్‌కు సంబంధించి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తగిన ప్రణాళికలు రూపొందిస్తానని, ప్రజలకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించేలా చర్యలు చేపడతానని ఆయన పేర్కొన్నారు.

పర్యావరణ సహిత అభివృద్ధి మేలు: ఎంపీ శ్రీభరత్



సమీక్షిస్తున్న ఎంపీ శ్రీభరత్, చైర్మన్ అంగముత్తు

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు పర్యావరణంతో కూడిన అభివృద్ధి సాధించాలని ఎంపీ శ్రీభరత్ సూచించారు. పోర్టు అడ్మిన్ కార్యాలయంలో సోమవారం అధికారులతో పలు అంశాలపై చర్చించారు. కాలుష్య నియంత్రణ, ఎస్ఆర్ కాలువ, ఫిషింగ్ హార్బర్ అభివృద్ధిపై సమీక్షించారు. పోర్టు పరిసరాల్లో కాలుష్యం స్థానిక ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తున్నదని, కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. క్రూయిజ్ టూరిజం ఎప్పటిలోగా అందుబాటులోకి రానున్నదీ తెలుసుకున్నారు. ఈ సమావేశంలో పోర్టు చైర్మన్ అంగముత్తు, డిప్యూటీ చైర్మన్ దూబేష్ కుమార్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

'రక్తదానంతో ప్రాణదానం'

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 9: రక్తదానంపై వున్న అపోహలను యువత విడనాడి రక్తదానం చేసి ఆపదలో వున్న వారికి ప్రాణదానం చేయాలని టీడీపీ నాయకుడు కరణం ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. తుంగ్లాం యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం తుంగ్లాంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి యువత నుంచి విశేష స్పందన లభించింది. శిబిరంలో రక్తదానం చేసిన వారికి ముత్యాలనాయుడు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శెట్టి నరసింగరావు, వరహాలు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు ఎంపీ, ఎమ్మెల్యే పరామర్శ

ఎన్‌ఏడీ జంక్షన్, సెప్టెంబరు 9: జీవీఎంసీ 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ తండ్రి బొమ్మిడి అప్పలనాయుడు (78) ఆదివారం రాత్రి బుచ్చిరాజుపాలెంలో మృతిచెందాడు. విశాఖ ఎంపీ శ్రీభరత్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అప్పలనాయుడు మృతదేహం వద్ద నివాళులర్పించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అప్పలనాయుడు, కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, దాడి వెంకటరమేష్, గళ్ల చిన్న, సరగడం రాజశేఖర్, బల్ల శ్రీనివాసరావు, రాపర్తి కన్నా, సేనాపతి శంకరరావు, మొల్లి లక్ష్మణరావు, పిల్ల వెంకటరావు, మద్దెల రాజశేఖర్, తదితరులు నివాళులర్పించారు.

నిలిచిన తాగునీటి సరఫరా

మల్కాపురం, సెప్టెంబరు 9: సమస్యల పరిష్కారం కోసం జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అవుట్‌సోర్సింగ్ కార్మికులు సోమవారం నిరసన చేపట్టారు. దీంతో పారిశ్రామిక ప్రాంతంలోని ఏడు వార్డుల పరిధిలో నీటి సరఫరా నిలిచిపోయింది. సమస్యలపై ఉన్నతాధికారులు స్పందించి, న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో మంగళవారం నుంచి యథావిధిగా విధులకు హాజరవుతామని కార్మికులు తెలిపారు.

మానవత్వం చాటుకున్న కార్మికులు

మల్కాపురం, సెప్టెంబరు 9: జీవీఎంసీ పారిశుధ్య కార్మికుడు అప్పలనాయుడు అనారోగ్యంతో మృతిచెందాడు. కుటుంబ కలహాలతో ఇంటికి దూరంగా ఉంటూ మృత్యువాత పడడంతో సహోద్యోగులు మానవత్వం చాటుకుని, అతడి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. మల్కాపురం శ్మశానవాటికకు తరలించి, వారే దహన సంస్కారాలు నిర్వహించారు. వారిని జీవీఎంసీ అధికారులు అభినందించారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే విజయవాడ వరదలు

» మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరదలకు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని నిర్లక్ష్యంవల్ల మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. వైసీపీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వరద సమాచారం ఉన్నప్పటికీ ప్రజలను అప్రమత్తం చేయడంలో విఫలమైందన్నారు. వరదల కారణంగా సంభవించిన మరణాలకు సీఎంతో సహా మంత్రులంతా బాధ్యతవహించాలన్నారు. బుడమేరు వరదపై అధికారులు భిన్నప్రకటనలు చేయడం నిర్లక్ష్యానికి అద్దంపడుతోందన్నారు. వరద బాధితులకు ఎలాంటి సహాయం చేయలేదన్నారు. కృష్ణా రక్షణ గోడ వైసీపీ ప్రభుత్వమే నిర్మించిందని, లేదంటే నగరాన్ని వరద ముంచెత్తేదని వెల్లడించారు.

డిసెంబరు 15న గవర మహాసభ

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 9: ప్రపంచ గవర మహా సభను డిసెంబరు 15న సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో నిర్వహించన్నుట్లు గవర ప్రపంచ చారిటబుల్ ట్రస్టు సీఏ ఏవీ రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందిస్తున్న మూడు సంఘాలను సత్కరిస్తామన్నారు. గవర జాతీయుల ఆచార వ్యవహారాలపై పుస్తకావిష్కరణ, తోడు నీడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి గవర సంఘాల ప్రతినిధులు హాజరుకావాలని కోరుతున్నామన్నారు.

'ఉక్కు' పరిరక్షణకు నేడు రాస్తారోకో

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 9: స్టీల్‌ప్లాంటును పరిరక్షించడంతో పాటు ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి కూర్మన్నపాలెం కూడలిలో రాస్తారోకో చేపడుతున్నట్టు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. ఉక్కు ప్రైవేటీకరణ తెరపైకి వచ్చినప్పటి నుంచి ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నా కేంద్రం స్పందించకపోవడం దారుణమన్నారు.

'రాస్తారోకోను జయప్రదం చేయండి'

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే రాస్తారోకోల్లో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు జె.అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. కూర్మన్నపాలెంలో జరుగుతున్న రిలే దీక్షలనుద్దేశించి మాట్లాడుతూ ప్లాంట్‌లో ఒక ఫర్నేస్ ద్వారా మాత్రమే ఉత్పత్తి చేయడం దుర్మార్గమైన చర్యన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు ఎన్.రామారావు, యూ.రామస్వామి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్:** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీకన్య, కిన్నెర, శారద, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీకాంత్ (గాజువాక).
- **సరిపోదా శనివారం:** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1,2 (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం:** నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ఆయ్:** రమాదేవి, వెంకటేశ్వర-2, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), హెవెన్-3 (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **కమిటీ కుర్రోళ్ళు:** శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **తంగలాన్:** నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 48, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 38, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 30, బీరకాయలు 42, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 34, క్యాబేజీ 22, క్యారేట్ 30, దొండకాయలు 34, బంగాళదుంపలు 29, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 38, బరబాటి 42, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 105, గోరుచిక్కుడు 34, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 105, పొటల్స్ 36, కీరదోస 32, క్యాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 54, కంద 54, దేముడుచిక్కుడు 62, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	85
ఫారం ధర	--	105
విత్ స్కిన్	--	180
స్కిన్‌లెస్	--	190

కామన్ వెల్త్ చెస్ టోర్నీలో అఖిల్‌ప్రసాద్‌కు పతకాలు


పతకాలతో అఖిల్‌ప్రసాద్

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 9: ప్రతిష్ఠాత్మక కామన్ వెల్త్ యూత్ చెస్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన చిన్నారి అఖిల్ ప్రసాద్ రెండు రజత పతకాలు సాధించాడు. శ్రీలంకలో జరిగిన ఈ టోర్నీలోఅండర్-12 బాలుర విభాగంలో భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించిన అఖిల్ ప్రసాద్ అద్భుతంగా రాణించి క్లాసిక్ ఈవెంట్‌లో 6.5 పాయింట్లతో రజత పతకం, ర్యాపిడ్ ఈవెంట్‌లో 5.5 పాయింట్లతో రజతం సొంతం చేసుకున్నాడు. శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ఏడవ తరగతి చుదువుతున్న అఖిల్ ప్రసాద్...ప్రస్తుత రేటింగ్ 1582 కాగా, ఈ టోర్నీలో సాధించిన విజయాలతో మరో 79.2 పాయింట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. అఖిల్ ప్రసాద్‌ను జిల్లా చెస్ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ రంగాల బాబూరావు, మణికంఠరావు, ఉమామహేశ్వరరావు తదితరులు అభినందించారు.

నైట్ షెల్టర్లలో సమస్యల పరిష్కారానికి వినతి


గండి బాబ్జీకి వినతి పత్రం అందిస్తున్న ఏయూటీడీ సిబ్బంది

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 9: ఏయూటీడీ నిర్వహిస్తున్న డే, నైట్ హోం షెల్టర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు టీడీపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షుడు గండి బాబ్జీని కోరారు. ఈ మేరకు సోమవారం ఏయూటీడీ సిబ్బంది బాబ్జీకి వినతి పత్రం సమర్పించారు. షెల్టర్ల ప్రాముఖ్యతను వివరించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 32వ వార్డు అధ్యక్షుడు మహేష్, ఏయూటీడీ సిబ్బంది కె.జ్యోతిర్మయి, భాస్కరరావు, లీలావతి, శ్రీనివాస్, ధనలక్ష్మి, శాంతి, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఐటీఐ అభ్యర్థులకు అప్రెంటీస్ మేళా రేపు

కంచరపాలెం, సెప్టెంబరు 9: కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో ఈనెల 11వ తేదీన ఐటీఐ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులకు అప్రెంటీస్ మేళాను నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్, జోన్-1 ఉపసంచాలకులు ఆర్.వి. రమణ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళాలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, కార్పెంటర్, వెల్డర్, టర్నర్, మెషినిస్టు, ఆర్ &ఏసీ, ఎలక్ట్రానిక్ మెకానిక్, మేషన్. డీఎం తదితర కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనవచ్చు. ప్రభుత్వ రంగ సంస్థలు ఈస్ట్ కోస్ట్ రైల్వే, హిందుస్థాన్ షిప్‌యార్డుతోపాటు 10 ప్రైవేటు కంపెనీలు పాల్గొననున్నాయన్నారు. అర్హత గల అభ్యర్థులు 11వ తేదీ ఉదయం 9గంటలకు కంచరపాలెంలో ప్రభుత్వ పాత ఐటీఐ వద్దకు బయోడేటా, అన్ని ధ్రువపత్రాలతో రావాలని కోరారు.

రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీకి జిల్లా జట్టు

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 9: ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ నిర్వహించిన అండర్ - 9 ఓపెన్, బాలికల జిల్లా జట్టు ఎంపిక పోటీలు సోమవారం ముగిశాయి. నగరంలోని ఓ స్కూల్‌లో జరిగిన ఈ టోర్నీ ఓపెన్ కేటగిరిలో అశ్విని అరవపల్లి, కె. వెంకట కీర్త...బాలికల విభాగంలో బంధం కోమలిక, సిరిసిపిల్లి లాశ్రిత ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించారు. ఈ చిన్నారులు ఈనెల 21 నుంచి విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి చెస్ చాంపియన్‌షిప్ టోర్నీలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్టు ఆల్ విశాఖ చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రంగాల బాబూరావు తెలిపారు.

జనసేన పార్టీ కార్యాలయ ఆవరణలో దీపారాధన


దీపాలను వెలిగిస్తున్న వీరమహిళలు

సీతంపేట, సెప్టెంబరు 9: సీతంపేటలోని జనసేన పార్టీ నగర కార్యాలయంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం జనసేన వీరమహిళలు పూజలు నిర్వహించారు.అనంతరం పందిరి వద్ద దీపారాధన చేశారు. కోలాటం తదితర సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి ఒకరోజు టోకెన్ సమ్మె

- జీతాలు పెంచాలని జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ నీటిసరఫరా విభాగం కార్మికుల డిమాండ్


సమ్మెలో పాల్గొన్న నీటి సరఫరా విభాగం అవుట్‌సోర్సింగ్ కార్మికులు

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ నీటి సరఫరా విభాగంలోని అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్లు, లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం విధులను బహిష్కరించి ఒకరోజు టోకెన్ సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎం.ఆనందరావు మాట్లాడుతూ నీటి సరఫరా, యూజీడీ, పంప్‌హౌస్‌లతోపాటు వాటికి అనుసంధానంగా ఉన్న ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కార్మికులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయకపోవడంతో ఒక రోజు సమ్మెకు దిగామన్నారు. అన్‌స్కిల్డ్ వారికి నెలకు రూ.25,410, సెమీస్కిల్డ్ వారికి రూ.29,610 వేతనం చెల్లించేందుకు వీలుగా 2023 జూన్‌లో జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదించిందన్నారు. దీనిపై ప్రభుత్వం అధికారుల కమిటీని ఏర్పాటుచేయగా కమిటీ కూడా ప్రజారోగ్యం విభాగంలో పారిశుధ్య సూపర్‌వైజర్లు, వర్కర్‌కమ్ డ్రైవర్లను వివిధ కేటగిరీలుగా విభజించి, వేతనాలను నిర్ణయిస్తూ ఈ ఏడాది ఫిబ్రవరిలో నివేదిక అందజేసిందన్నారు. కానీ ఇంతవరకూ కార్మికుల జీతాలను పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు కొంతమంది అధికారులు, యూనియన్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని ప్రభుత్వం సాకులు చెబుతోందన్నారు. జీవీఎంసీలో అభివృద్ధి పనులుచేసే కాంట్రాక్టర్లకు ఇచ్చే ఎస్ఎస్ఆర్ రేట్లలో ప్లంబర్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్లకు రూ.750 వరకూ చూపిస్తున్న అధికారులు నీటిసరఫరా విభాగం కార్మికులకు వేతనాలను చెల్లించకుండా వివక్ష చూపుతున్నారన్నారు. కార్మికుల సమస్య పరిష్కారం కాకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు సత్యం, శ్రీనివాసరావు, మోహన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ను వ్యూహాత్మక రంగంలో కొనసాగించాలి

- విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలి
- స్టీల్‌ప్లాంటు అధికారుల సంఘం డిమాండ్

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం బ్యాంకింగ్, బీమా, పవర్, సిమెంట్ తదితర రంగాలను వ్యూహాత్మక రంగంలోను, స్టీల్‌ను వ్యూహాత్మకం కాని (నాన్ స్ట్రాటజిక్) రంగంగాను గుర్తించి పెట్టుబడుల ఉపసంహరణకు నిర్ణయించిందని, ఆ కారణంగానే విశాఖ ఉక్కును విక్రయించాలని చూస్తున్నారని, తక్షణమే దీనిని ఉపసంహరించుకోవాలని విశాఖ స్టీల్ అధికారుల సంఘం డిమాండ్ చేసింది. విశాఖ పౌర గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్ మాట్లాడుతూ, స్టీల్ అనేది నిత్యావసర వస్తువు అని ప్రతి రంగంలోను దాని అవసరం ఉందని, అటువంటి దానిని వ్యూహాత్మకం కాని రంగంగా నిర్ధారించడం తగదన్నారు. వెంటనే కేంద్రం తన నిర్ణయం మార్చుకొని స్టీల్‌ను కూడా ప్రాధాన్య రంగంలోని మార్చాలని డిమాండ్ చేశారు. ఒకవైపు వ్యూహాత్మకం కాదంటూనే మరోవైపు సెయిల్‌ను లక్ష కోట్ల రూపాయలతో విస్తరించాలని ఆదేశించిందని, ఇటు వైపు విశాఖ ఉక్కును విక్రయించాలని చూస్తోందన్నారు. విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. దీనివల్ల విశాఖ ఉక్కుకు ముడి పదార్థాలు, నిధుల కొరత తీరుతుందన్నారు. ఢిల్లీలో మంగళ, బుధవారాల్లో ఉన్నత స్థాయి సమావేశాలు జరుగుతున్నాయని, అక్కడ ఈ రెండింటిపై నిర్ణయాలు తీసుకుంటే విశాఖ ఉక్కు సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. గత రెండేళ్లుగా విశాఖ ఉక్కులో 50 శాతం ఉత్పత్తే జరుగుతున్నదని, దీనివల్ల రూ.17 వేల కోట్ల యంత్ర పరికరాలు నిర్వీర్యం అయిపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేకపోతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు మార్టూరు శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి మల్లయ్య, ఓబీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీవో 115ను రద్దు చేయాలి


నిరసన వ్యక్తంచేస్తున్న కేజీహెచ్‌లోని నర్సులు

మహారాణిపేట, సెప్టెంబరు 9: తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ కేజీహెచ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ నర్సులు ఆందోళన చేపట్టారు. సోమవారం కేజీహెచ్ పరిపాలన ద్వారం ఎదుట ఈ మేరకు నిరసన వ్యక్తంచేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జారీ చేసిన జీవో 115 ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇంటెన్సిఫైడ్ శిక్షణ తీసుకున్న వారికి స్టాఫ్ నర్సు పోస్టుల కేటాయింపును వ్యతిరేకిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అత్యవసర విధుల్లో పాల్గొంటూ, జీవో రద్దు కోసం దశలవారీగా తమ ఆందోళనను కొనసాగిస్తామని హెచ్చరించారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

అల్లిపురం, సెప్టెంబరు 9: జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సోమవారం జర్నలిస్టుడే సందర్భంగా 32వవార్డులోని నేరెళ్లకోనేరు వద్దనున్న జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నేత, కార్పొరేటర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో నగరానికి చెందిన 60 మంది జర్నలిస్టులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతి థిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు తాను కృషి చేస్తానన్నారు. పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బీజేపీ ఎమ్మెల్యేలు వేతనం


ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కలిసిన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, సెప్టెంబరు 9: ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు, వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని మర్యాద పూర్వకంగా కలిశారు. బీజేపీ తరపున ఉన్న ఎనిమిది మంది ఎమ్మెల్యేలు తమ ఒక నెల వేతనాన్ని విజయవాడ వరద బాధితుల సహాయార్థం అందిస్తున్నట్టు విష్ణుకుమార్ రాజు సీఎంకు ఈ సందర్భంగా తెలిపారు.

మురళీనగర్ వాకర్స్ క్లబ్ సాయం

మురళీనగర్ ; విజయవాడ వరద బాధితుల సహాయార్థం మురళీనగర్‌లోని వాకర్స్ క్లబ్ సభ్యులు సోమవారం విరాళాన్ని అందజేశారు. క్లబ్ సభ్యులు, దాతలనుంచి సేకరించిన మొత్తం రూ. 75,116 చెక్కు రూపంలో సీఎం సహాయ నిధికి అందజేసినట్టు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా.చంద్రమౌళి తెలిపారు. సోమవారం ఈచెక్‌ను స్థానిక యూనియన్ బ్యాంకు మేనేజర్‌కు అందజేశారు. వాకర్స్‌క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు, కోశాధికారి జె.కూర్మారావు ఉన్నారు.


చెక్కును బ్యాంకు మేనేజర్‌కు అందిస్తున్న క్లబ్ సభ్యులు

ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే ధ్యేయం

- క్రీడా భారతి ప్రచార కమిటీ ప్రతినిధి ప్రసాద్ మహంకర్


మాట్లాడుతున్న ప్రసాద్ మహంకర్

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 9: క్రీడా భారతి సహకారంతో అనేక మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదిగినట్టు క్రీడా భారతిజాతీయ ప్రచార కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్ మహంకర్ పేర్కొన్నారు. సోమవారం విశాఖలో పర్యటించిన ఆయన స్థానిక క్రీడా భారతి ప్రతినిధులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లతో సమావేశంపై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ క్రీడా భారతి అనేది ఒక క్రీడాంశానికి చెందిన సంఘం కాదని, సామాజిక సేవా సంస్థని తెలిపారు. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించి వారిని ఉన్నతస్థాయిలో తీర్చిదిద్దడమే తమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఇకపై, జాతీయ స్థాయి టోర్నీల్లో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ. లక్ష, ద్వితీయ స్థానానికి రూ.50 వేలు, తృతీయ స్థానానికి రూ.30 చొప్పున బహుమతులందించనున్నామన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్నత స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు నిపుణులైన కోచ్‌లు అవసరమని, ఆ దిశగా స్థానిక క్రీడాభారతి ప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, మాజీ ఒలింపియన్ ఎం.వి.మాణిక్యాలు, రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వీఐపీల భద్రతపై పీఎస్‌వోలకు శిక్షణ

మహారాణిపేట, సెప్టెంబరు 9: వీఐపీల భద్రత కోసం పీఎస్‌వోలకు శిక్షణ కార్యక్రమాన్ని పోలీసు కమిషనర్ శంఖబ్రాత బాగ్చీ సోమవారం సిటీ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఐపీలకు భద్రతా విధులు నిర్వహించే పీఎస్‌వోలు పారదర్శకత, శారీరక దారుఢ్యంతో ఉండాలన్నారు. ఈ అర్హతలతో ఎంపిక చేసిన కానిస్టేబుళ్ల ఈనెల 28 వ తేదీ వరకు శిక్షణ అందించనున్నట్టు చెప్పారు.

వరద బాధితులకు కూరగాయలు


కూరగాయలతో సీతమ్మధార రైతుబజార్ రైతులు

సీతమ్మధార: విజయవాడలో వరద బాధితుల కోసం సీతమ్మధార రైతుబజార్‌లో రైతులు రెండు వేల కిలోల కూరగాయలను సేకరించారు. బజార్ ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకుడు సతీష్ వీటిని సమకూర్చారు. కలెక్టర్ ఏర్పాటు చేసిన వాహనంలో విజయవాడ తరలించారు.

అక్కయ్యపాలెం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం 45వ వార్డు నరసింహనగర్ రైతుబజారులో వ్యాపారాలు సాగిస్తున్న రైతులు 360 కిలోల కూరగాయలను అందించారు. రైతుబజారు ఎస్టేట్ అధికారి పి.చిన్నబాబు, సహాయకుడు ఆర్. సత్యనారాయణ ఆధ్వర్యంలో వీటిని విజయవాడకు వ్యాన్‌లో పంపించారు.

వాడవాడలా వినాయక ఉత్సవాలు


త్రిముఖ గణపతి అవతారంలో దర్శనమిస్తున్న దుర్గాగణపతి


గవరకంచరపాలెంలో కొలువుదీరిన గణనాథుడు

జ్ఞానాపురం, సెప్టెంబరు 9: నగరంలోని కాన్వెంటు కూడలిలోని సౌభాగ్యగణపతి ఆలయం వద్ద వైష్ణవి హోల్‌సేల్ వెజిటేబుల్ మార్కెట్ వర్తకసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 16 అడుగుల గణపతిని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీటితో పాటు జ్ఞానాపురంలోని పలు మండపాలను ఆయన సందర్శించారు. గవరకంచరపాలెంలోని యంగ్ బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి ఉత్సవాలు జరుపుతున్నారు.

త్రిముఖ గణపతి అవతారంలో....

సీతంపేట: సీతంపేట దుర్గాగణపతి ఆలయంలో ఆలయ ఈఓ రమాభాయి, ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి గోవింద్ పర్యవేక్షణలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మూడోరోజు సోమవారం దుర్గాగణపతి త్రిముఖ గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి గణపతి హోమం, పంచామృతాలతో అభిషేకాలను అర్చకులు నటరాజన్ స్వామి ఆధ్వర్యంలో చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

కొండవాలు ప్రాంతాల్లో 12,750 కుటుంబాలు

... 5వ పేజీ తరువాయి

అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తాటిపూడి రిజర్వాయర్ నుంచి నీటి విడుదల, వర్షాలకు గోస్తనీలో వరద ప్రవాహం పెరిగినందున పద్మనాభం, భీమిలి మండలాల్లో తీర గ్రామాలను అప్రమత్తం చేశామన్నారు. జిల్లాలో పలుచోట్ల రోడ్లు దెబ్బతిన్నాయని, దీనిపై శాఖల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. వాయుగుండం ఏర్పడక ముందు విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లిన 30 బోట్లు సురక్షితంగా గోపాల్‌పూర్‌లో ఒడ్డుకు చేరుకున్నాయని, ఈ మేరకు సంబంధిత జిల్లా కలెక్టర్‌తో మాట్లాడామన్నారు. వర్షాలకు అక్కడక్కడా ప్రహరీ గోడలు, పాఠశాల గోడలు కూలాయని కలెక్టర్ తెలిపారు. విజయవాడ వరద బాధితులకు రెండున్నర లక్షల ఆహార పొట్లాలు, లక్షన్నర లీటర్ల పాలు, రెండు లక్షల వాటర్ బ్యాటిళ్లు పంపించామన్నారు. విజయవాడలో విధులు నిర్వహణకు 1,000 మంది పారిశుధ్య సిబ్బందిని పంపించామని, నేవీ నుంచి బోట్లు వెళ్లాయని కలెక్టర్ పేర్కొన్నారు.

ఏయూ హాస్టళ్ల ప్రక్షాళనపై దృష్టి

... 5వ పేజీ తరువాయి

ఇచ్చిన విద్యార్థులపైనా చర్యలు తీసుకోనున్నారు. అదే సమయంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషిచేస్తారు.

నాన్ బోర్డర్స్‌తో ఇబ్బందులు

వర్సిటీలోని 40కిపైగా హాస్టళ్లలో సుమారు ఎనిమిది వేల మంది వరకు విద్యార్థులు ఉంటున్నారు. అనేక హాస్టళ్లలో నాన్ బోర్డర్స్ ఎక్కువగా ఉంటున్నారు. తనిఖీల ద్వారా వారికి చెక్ చెప్పాలని అధికారులు భావిస్తున్నారు. దీనివల్ల హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు కూడా ఇబ్బందులు తప్పు తాయని అధికారులు పేర్కొంటున్నారు. నాన్ బోర్డర్స్ ఉండడం వల్ల జూనియర్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది.

ఐడీ కార్డు తప్పనిసరి

విద్యార్థులు వర్సిటీలో ఉన్న సమయంలో తప్పనిసరిగా మెడలో ఐడీ కార్డు ధరించాలన్న నిబంధనను అధికారులు తీసుకువచ్చారు. తరగతికి వచ్చినప్పుడు తప్పనిసరిగా విద్యా ర్థులు ఇకపై ఐడీ కార్డు ధరించాలి. అలాగే, హాస్టల్ విద్యార్థులు వర్సిటీలో, బయటకు వెళ్లి హాస్టల్‌లోకి వచ్చి నప్పుడు ఐడీ కార్డును ధరించాలని అధికారులు ఆదే శించారు. ఐడీ కార్డు ధరించని విద్యార్థిని అనుమతించవద్దని సెక్యూరిటీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మెస్‌లో భోజనం పెట్టేటప్పుడు కూడా తప్పనిసరిగా విద్యార్థులు ఐడీ కార్డును పరి శీలించాల్సిందిగా వార్డెన్లకు ఆదేశాలు అందాయి. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగేలా చేసేందుకు, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు ఈ ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్టు రెక్టార్ ప్రొఫెసర్ కిశోర్‌బాబు తెలిపారు. ప్రతిరోజూ మూడు నుంచి నాలుగు హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

సాహితీ కోవిదుడు 'బులుసు'


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సన్నిధానం నరసింహ శర్మ, తదితరులు

సీతంపేట, సెప్టెంబరు 9: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి స్మారక సమితి ఆధ్వర్యంలో విద్వాన్ బులుసు సీతారామ శాస్త్రి జయంతి సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 'పలుకుల భారతి స్ఫూర్తి...విద్వాన్ బులుసు సీతారామ శాస్త్రి' పేరిట కల్లూరి విజయలక్ష్మి సంకలనం చేసిన పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డీవీ సూర్యారావు అధ్యక్షతన జరిగిన సభలో సన్నిధానం నరసింహ శర్మ చేతుల మీదుగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బులుసు సీతారామ శాస్త్రి ఘనతను వివరించారు. వేదపండితుడిగా, వీరేశలింగం విద్యాలయ తెలుగు అధ్యాపకులుగా, హోమియో వైద్యునిగా రాజమహేం ద్రవరానికి వన్నె తెచ్చారని తెలిపారు. విశ్రాంత ఆచార్యులు, కవి డాక్టర్ కొచ్చర్లకోట సత్యనారాయణ, శాస్త్రి కుమారులు బులుసు అనంత రామయ్య, దుర్గాప్రసాద్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు అస్వస్థతపై ఫిర్యాదు

మహారాణిపేట, సెప్టెంబరు 9: తన భార్య అస్వస్థత పాలవడడానికి ఓ ఐవీఎఫ్ సెంటర్ కారణమంటూ ఆమె భర్త త్రి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసుకు సంబంధించి వివరాలివి.. సబ్బవరానికి చెందిన పి. ససింద్ర కుమార్, రోజా దంపతులకు పిల్లలు లేకపోవడంతోరామ్‌నగర్ సమీపంలో ఒయాసిస్ ఐవీఎఫ్ సెంటర్‌లో కొద్దిరోజుల కిందట వైద్య పరీక్షలుచేయించారు.స్కానింగ్ అంతా నార్మల్‌గా ఉందని అక్కడి వైద్యులు పంపించారు. ఈ క్రమంలో ఈనెల 4 వ తేదీన అర్ధరాత్రి రోజాకు తీవ్రమైన కడుపు నొప్పి రావటంతో హుటాహుటీన సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. ఆమెకు గర్భ ధారణ జరిగి అది విచ్ఛిత్తి జరిగినట్టు గుర్తించి అత్యవసర శస్త్ర చికిత్స నందించారు. ప్రస్తుతం రోజా అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నా రు. ఈ స్థితిలో ఆమె భర్త ఐవీఎఫ్ సెంటర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అవసరమైన వైద్య పరీక్షలు చేశాం

మా ఆసుపత్రికి వచ్చిన రోజాకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాం. ఆమెకు ఎక్టోపిక్ గర్భం ఉన్న విషయం తెలియజేశాం. ఆ వివరాలతో స్కానింగ్ రిపోర్టులనూ అందజేశాం. కానీ, తమ వద్ద ఉన్న రోగి ఫైల్ వివరాలను మాత్రం అందజేయలేదు.

- డాక్టర్ రాధిక, ఒయాసిస్ ఐవీఎఫ్ సెంటర్ నిర్వాహకులు

లోతట్టు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

కొండచరియలు విరిగిపడిన ప్రాంతం పరిశీలన


గోపాలపట్నం రామకృష్ణానగర్‌లో కొండచరియలు జారిపడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

గోపాలపట్నం, సెప్టెంబరు 9: గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో ముంపు, లోతట్టు, కొండవాలు ప్రాంతాల్లో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సోమవారం పర్యటించారు. వర్షంతో రామకృష్ణానగర్‌లో కొండచరియలుజారిపడిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ ప్రాంతంలో ప్రమాదకర ప్రదేశాలను పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు కలెక్టర్‌కు చూపించారు. అనంతరం కొత్తపాలెం శివారులోని ముంపు ప్రాంతాలను కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. వర్షాలకురిసే సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులను ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో ముంపు ప్రాంతాల్లో వరద నివారణ చర్యలు చేపట్టాలని రెవెన్యూ, జీవీఎంసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా కొండచరియలు జారిపడే ప్రమాదముంటే ముందుగానే నివాసితులను పునరావాస కేంద్రాలకు తరలించాలని, అక్కడ వారికి అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే కొండచరియలు జారిపడకుండా చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట రెవెన్యూ, జీవీఎంసీ, పోలీస్ అధికారులున్నారు.

స్కంద గణపతి అలంకరణలో సంపత్ వినాయగర్ స్వామి



సిరిపురం, సెప్టెంబరు 9 : సిరిపురంలోని సంపత్ వినాయగర్ దేవాలయంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామివారు స్కంద గణపతిగా భక్తులకు సోమవారం దర్శనమిచ్చారు. వేకువజాము నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. ఉదయం గణపతి హోమం, నాదస్వర కచేరి, ఉభయదాతలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన జరిపారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు నిర్వహించారు.

కైలాసగిరిపై అదుపు తప్పిన బస్సు - పలువురికి స్వల్ప గాయాలు



మహిళతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ఎండాడ, సెప్టెంబరు 9 : కైలాసగిరిపై ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి కొండవాలును ఢీకొనడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ వెంకట్రావుతో పాటు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ప్రైవేటు ట్రావెల్స్‌కి చెందిన బస్సు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన 18 మంది పర్యాటకులతో టూర్ ప్యాకేజీలో భాగంగా సోమవారం కైలాసగిరి వచ్చారు. కొండపై డౌన్‌లో బస్సు పార్కింగ్ చేసి ఉండగా, ఒకేసారి పర్యాటకులు వేగంగా ఎక్కడంతో ఊపుకి బస్సు హ్యాండ్ బ్రేక్ వదులు కావడంతో న్యూట్రల్‌కి వచ్చేసింది. దీంతో ఒక్క ఉదుటున ముందుకు కదిలింది. కింద ఉన్న డ్రైవర్ అప్రమత్తమై వెంటనే బస్సు ఎక్కి పక్కనున్న కొండవాలును ఢీకొట్టాడు. దీంతో బస్సులో ఉన్న కొంతమందికి స్వల్ప గాయాలు కావడంతో డ్రైవర్ మరో బస్సులో వారిని కేజీహెచ్‌కి తరలించారు. కాగా క్షతగాత్రులను నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి కేజీహెచ్‌కి వెళ్లి పరామర్శించారు. వారి వివరాలు తెలుసుకుని, వైద్యులను మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

భీమిలి పీఎస్‌ను సందర్శించిన సీపీ

భీమునిపట్నం, సెప్టెంబరు 9 : పట్టణంలోని పోలీస్ స్టేషన్‌ను సీపీ డా. శంఖబ్రత బాగ్చి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, స్టేషనరీ గది, కంప్యూటర్ రూమ్, మరుగుదొడ్లు, స్టేషన్ ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సిబ్బందికి ఏ సమస్య ఉన్నా.. తనను సంప్రతించాలని చెప్పారు. ఆయనతో పాటు సీఐ బొడ్డేపల్లి సుధాకర్, ఎస్ఐ హరీష్ ఉన్నారు.

సినిమా గైడ్

- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్:** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీకన్య, కిన్నెర, శారద, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీకాంత్ (గాజువాక).
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1,2 (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), హెవెన్-3 (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **కమిటీ కుర్రోళ్లు :** శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **తంగలాన్ :** నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 48, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 38, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 30, బీరకాయలు 42, ఆనపకాయలు 20, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 22, క్యారెట్ 30, దొండకాయలు 34, బంగాళదుంపలు 29, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 38, అల్లం (పాతది) 110, బరబటి 42, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 105, గోరుచిక్కుడు 34, దోసకాయ 30, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 105, పొటల్స్ 36, కీరదోస 32, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 54, కంద 54, దేముడు చిక్కుడు 62, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 26, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామ కాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 85
ఫారం ధర	-- 105
విత్ స్కిన్	-- 180
స్కిన్‌లెస్	-- 190



పాండ్రంగి వద్ద గోస్తనీ నదిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా



పద్మనాభం : లింగన్నపేటలో నీట మునిగిన వరి



నగరపాలెం ప్రధాన రహదారిపై చేరిన నీరు



సింహాచలంలోని సింహగిరి మెట్లపై జలధార

పొంగుతున్న గెడ్డలు, కాలువలు

- ఉధృతంగా గోస్తనీ నది
- నీట మునిగిన పంట పొలాలు
- పలు ప్రాంతాల్లో పర్యటించిన జేసీ అశోక్, భీమిలి ఎమ్మెల్యే గంటా



కె. నగరపాలెం వంతెన వద్ద ఉధృతంగా గెడ్డ



ఆనందపురం : గంభీరం జలాశయాన్ని పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్

పద్మనాభం, సెప్టెంబరు 9 : భీమిలి నియోజకవర్గంలో రెండు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు గెడ్డలు, కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వరద భారీగా వస్తుండడంతో కాలువలకు గండ్లు పడి పొలాలు నీట మునుగుతున్నాయి. పద్మనాభం మండలంలోని పొట్నూరు నూకాంబికా చెరువులోకి విజయనగరం జిల్లా జామిలోని ఎం. కొత్తవలస నుంచి సాగునీరు వచ్చే కాలువకు గండి పడింది. ఆ నీరంతా సమీపంలోని పంట పొలాలను ముంచింది. బుడ్డివలస పంచాయతీ పరిధి లింగన్నపేటలో 15 ఎకరాలు నీట మునిగింది,కుండపోత వర్షాలతో చెరువులన్నీ నిండాయి. కొన్నిచోట్ల కాలువలు, చెరువుల తూములు లీకేజీలతో పొలాలు ముంపునకు గురవుతున్నాయి.

ఎమ్మెల్యే గంటా పర్యటన

మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో గంటా పర్యటించారు. పొట్నూరు వద్ద దుమ్మొరిగెడ్డపై ఉన్న కాజువే మీదుగా ప్రవహిస్తున్న నీటి ప్రవాహాన్ని, మద్ది కాజువేపై ప్రవహిస్తున్న ప్రవాహాలను పరిశీలించారు. రాకపోకలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. పొట్నూరు కాజువేను హైలెవెల్ కాజువేగా నిర్మించి ముంపు సమస్యను పరిష్కరిస్తామన్నారు. మద్ది కాజువే సమీపంలో పేరుకుపోయిన చెత్తా, చెదారం తొలగించాలని అధికారులను ఆదేశించారు. రెడ్డిపల్లి ఆర్‌అండ్‌బీ ప్రధాన రోడ్డుపై చెరువులా దర్శనమిస్తున్న నీటిని పరిశీలించారు.అనంతరం కొయ్యపేటలో వర్షాలకు కూలిన ఇళ్లను పరిశీలించి బాధితులను పరామర్శించారు. లింగన్నపేట, బుడ్డివలసల్లో నీట మునిగిన పంటలను కూడా పరిశీలించారు.

పాఠశాల భవనం కూల్చివేత

బుడ్డివలసలో శిథిలమైన పాఠశాల భవనం కొంత భాగం వర్షాలకు నేలకూలింది. ఈ భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే మండల విద్యాశాఖాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులు రాలేదన్న చెప్పి ప్రమాదకరమైన పాఠశాల భవనాన్ని నేలమట్టం చేయకపోతే ఎలాగని నిలదీశారు. ప్రాణ నష్టం జరగలేదు కనుక సరిపోయిందని, పిల్లలు ఉన్నప్పుడు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. వెంటనే పొక్లెయినరును రప్పించి మిగిలిన భవనాన్ని నేలమట్టం చేయించారు. అక్కడి నుంచి పాండ్రంగి గోస్తనీ నది ప్రవాహాన్ని పరిశీలించారు. గ్రామానికి వంతెన నిర్మించకపోవడంతో తరచూ సమస్య ఎదుర్కొంటున్నామని పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని త్వరలోనే పనులు పూర్తి చేయిస్తామన్నారు.

ఆనందపురం : మండలంలోని గంభీరం రిజర్వాయర్‌ను జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సందర్శించారు.ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రిజర్వాయర్ ఎడమ, కుడి కాలువల పరిధిలో లోతట్టు ప్రాంతాల్లో ఉంటున్న వారిని అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు తహసీల్దార్ శ్యామ్ ప్రసాద్, జల వనరుల శాఖాధికారులు ఉన్నారు.

కె. నగరపాలెంలో కొట్టుకుపోయిన మూడు గేదెలు



గంభీరం గెడ్డలో మొక్కల మధ్య చిక్కుకున్న గేదెల మృతదేహాలు

భీమునిపట్నం, సెప్టెంబరు 9 : గంభీరం గెడ్డ ఉధృతికి మూడు గేదెలు కొట్టుకుపోయాయి. వాటిలో రెండు మృతదేహాలు లభ్యం కాగా, మరొకటి గల్లంతైంది. 4వ వార్డు కె.నగరపాలెంకు చెందిన తొత్తడి శ్రీనివాసరావు ఆదివారం మధ్యాహ్నం తన ఆరు గేదెలను గంభీరం గెడ్డ సమీపంలో మేతకు తీసుకువెళ్లాడు. ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు తోడు మధ్యాహ్నం గెడ్డ గేట్లు ఎత్తివేయడంతో ఒక్కసారిగా నీటి ఉధృతి పెరిగింది. దీంతో ఆరు గేదెల్లో మూడు ఒడ్డుకు తోలుకు రాగా మరో మూడు ప్రవాహంలో కొట్టుకుపోయాయి. సోమవారం ఉదయం కె. నగరపాలెం వంతెన కింద పొదల వద్ద, పాత ర్యాంప్ వద్ద రెండు గేదెల మృతదేహాలు లభ్యమయ్యాయి. మూడో గేదె ఆచూకీ లభించలేదు. గ్రామస్థుల సహకారంతో జేసీ బీతో రెండు మృతదేహాలను ఒడ్డుకు చేర్చారు. మృతదేహాలకు భీమిలి పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరమణ పర్యవేక్షణలో తాళ్లవలస పశువుల ఆస్పత్రి ఇన్‌ఛార్జి వెటర్నరీ డాక్టర్ క్రాంతికిరణ్, అసిస్టెంట్ శివ పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నతాధికారులకు నివేదిస్తామని, నష్టపరిహారానికి సిఫార్స్ చేస్తామన్నారు. ఒక్కో గేదె రూ.1.30 లక్షలకు కొనుగోలు చేశానని, మూడు గేదెల వల్ల రూ. 4 లక్షల నష్టం వాటిల్లిందని శ్రీను విలపించాడు.

‘ఎవరూ పట్టించుకోవడం లేదు’



సాగర్‌నగర్ : భారీ వర్షాలకు చిన్న రుషికొండ, స్వర్ణభారతినగర్ మధ్యలో ప్రవహిస్తున్న గెడ్డ నీరు సమీపంలో ఉన్న ఇంట్లోకి చేరింది. మూడు రోజులుగా నివాసితులు ఆ ఇంట్లోనే ఉంటున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈమేరకు ఇంటి యజమాని టి. లక్ష్మణరావు సోమవారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

ఆక్రమణలతో రైతుల పాట్లు



తాటితూరులో గట్టు తీస్తున్న రైతు

భీమునిపట్నం (రూరల్) : గోస్తనీ నదికి అనుబంధంగా ఉన్న కురపల్లి ఏటి కాలువకు పూడిక తీయకపోవడం, ఆక్రమణల వల్ల వర్షాలకు సమీపంలోని పొలాలు ముంపునకు గుర య్యాయి. అలాగే జాతీయ రహదారి పక్కనున్న అవంతి కళాశాల ప్రాంతాల్లో కాలువలను పూడ్చి వేయడం వల్ల నీరంతా నగరపాలెం చేరుతుంది. తాటితూరు, మజ్జివలస, నారాయణరాజు పేట, సింగనబంద, లక్ష్మీపురం, మజ్జిపేటలో రైతులు పొలాల్లో నిండిపోయిన నీటిని తోడి గట్లు వేస్తున్నారు.

పునరావాస కేంద్రాలకు 65 మంది తరలింపు



గోపాలపట్నం పునరావాస కేంద్రంలో బాధితులు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 9 : భారీ వర్షాల నేపథ్యంలో కొండవాలు ప్రాంతాల్లోని 65 మందిని జీవీఎంసీ ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించామని అదనపు కమిషనర్ రమణమూర్తి తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 8వ జోన్ 91వ వార్డులోని రామకృష్ణానగర్ సమీపంలో కొండవాలు రక్షణ గోడ జారిపోవడంతో ఆ ప్రాంతంలోని 38 మందిని అప్రమత్తం చేసి, గోపాలపట్నం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు తరలించామన్నారు. జోన్-1 తగరపువలస పబ్లిక్ లైబ్రరీలో ఏడుగుర్ని, జోన్-2 13వ వార్డులో జైబీమ్ నగర్‌లో ఉన్న 20 మందిని పునరావాస కేంద్రాలకు తరలించి, వసతితో పాటు భోజనం సౌకర్యం కల్పించామన్నారు. నగరంలో ముందస్తుగా 80 పునరావాస కేంద్రాలు సిద్ధం చేశామని, కేంద్రాల్లో ఉన్న వారు ఆందోళన చెందకుండా కౌన్సెలింగ్ ఇస్తున్నామని తెలిపారు. అలాగే కాలువలు, గెడ్డల్లో వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామని చెప్పారు. అవసరమైన వారు టోల్ ఫ్రీ నెంబరు 180042500009 కు కాల్ చేసి సమాచారం తెలియచేయాలని కోరారు.

నగరపాలెం రహదారి జలమయం

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 9 : నగరపాలెం ప్రధాన రహదారి జలమయమైంది. గోస్తనీ నదికి ఆనుకుని ఉన్న ఈ గ్రామంలోకి రెండు రోజుల పాటు కురిసిన వర్షాలతో భారీగా నీరు చేరింది. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం ఉదయం గ్రామంలోని పరిస్థితిపై ఆరా తీశారు. అధికారులు గ్రామంలో పర్యటించి, ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. నీరు నిల్వ లేకుండా, అంటురోగాలు వ్యాప్తి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.

పాండ్రంగి వద్ద హెచ్చరిక బోర్డు

పద్మనాభం, సెప్టెంబరు 9 : పాండ్రంగిలో గోస్తనీ నది ప్రవాహాన్ని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పరిశీలించారు. కాజువే పూర్తిగా నీట మునగడంతో ప్రజలు రాకపోకలు సాగించకుండా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని మండల అధికారులను ఆదేశించారు. వరద ఉధృతి ఎక్కువగా ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయనతో పాటు భీమిలి ఆర్డీఓ భాస్కరరెడ్డి, డీటీ నియోగ్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లోకి నీరు రాకుండా చర్యలు

తగరపువలస, సెప్టెంబరు 9 : గోస్తనీ నదిలో నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో సమీప గ్రామాల్లోని ప్రజలు నీరు రాకుండా ఇసుక బస్తాలు వేసి, రక్షణ చర్యలు చేపడుతున్నారు. మూలకుద్దులో జరిగిన పనులను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. గ్రామంలోకి నీరు రాకుండా ఏర్పాట్లు చేయాలని, తగరపువలస, చిట్టివలస ప్రాంతాల్లోనూ రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

బండరాళ్లు తొలగింపు

ఆరిలోవ, సెప్టెంబరు 9 : జీవీఎంసీ 12వ వార్డు బీసీ కాలనీలో ఉన్న కొండవాలు ప్రాంతంలో పడిపోయే స్థితిలో ఉన్న బండరాళ్లను జీవీఎంసీ సిబ్బంది సోమవారం తొలగించారు. టీడీపీ నాయకులు ఒమ్మి సన్యాసిరావు, ముగ రాజారావు, గాడి సత్యం, గోవింద్ కొండవాలు ప్రాంతాల్లో సమస్యలు తెలుసుకోవడానికి వెళ్లారు. ఆ సమయంలో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న బండరాళ్లను గుర్తించి, జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో జడ్సీ సిబ్బందిని అక్కడికి పంపించి బండరాళ్లను తొలగించారు.

పర్యాటక కేంద్రంగా గంభీరం జలాశయం

ఆనందపురం, సెప్టెంబరు 9 : గంభీరం జలాశయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన జలాశయం నీటి మట్టాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చుట్టూ పచ్చని కొండలతో నగరానికి దగ్గరలో ప్రశాంతంగా ఉన్న ఈ ప్రాంతంలో కాటేజీలు నిర్మిస్తే పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తారన్నారు.రిజర్వాయర్ వరకు ఉన్న అప్రోచ్ రోడ్డును జీవీఎంసీ సహకారంతో అభివృద్ధి చేస్తామని చెప్పారు. వర్షాల వల్ల జరిగిన నష్టం వివరాలు తెలుసుకోవడానికి నియోజకవర్గం వ్యాప్తంగా పర్యటించానన్నారు. పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండలాల్లో కాజ్‌వేలపై వర్షం నీరు ఉధృతంగా ప్రవహిస్తోందన్నారు. ప్రాణ నష్టం జరగకుండా చూడడంతో పాటు సాధ్యమైనంతవరకు ఆస్తి, పంట నష్టం లేకుండా చూశామన్నారు. వలలు కొట్టుకుపోవడంతో నష్టం జరిగినట్టు మత్స్యకారులు చెప్పారని ఆ వివరాలను ప్రభుత్వానికి పంపాలని అధికారులను సూచించానని వెల్లడించారు. ఆయనతో పాటు స్థానిక నాయకులు ఉన్నారు.

పర్యావరణ సహిత అభివృద్ధి అవసరం : ఎంపీ శ్రీభరత్



పోర్టులో సమీక్షిస్తున్న ఎంపీ శ్రీభరత్, పక్కన పోర్టు చైర్మన్ అంగముత్తు, గండి బాబ్జి

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు పర్యావరణంతో కూడిన అభివృద్ధి సాధించాలని ఎంపీ శ్రీభరత్ సూచించారు. పోర్టు అడ్మిన్ కార్యాలయంలో సోమవారం అధికారులతో పలు అంశాలపై చర్చించారు. కాలుష్య నియంత్రణ, ఎస్ఆర్ కాలువ, ఫిషింగ్ హార్బర్ అభివృద్ధిపై సమీక్షించారు. పోర్టు పరిసరాల్లో కాలుష్యం స్థానిక ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తున్నదని, కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. క్రూయిజ్ టూరిజం ఎప్పటిలోగా అందుబాటులోకి రానున్నదీ తెలుసుకున్నారు. ఈ సమావేశంలో పోర్టు చైర్మన్ అంగముత్తు, డిప్యూటీ చైర్మన్ దూబేష్ కుమార్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే వరదలు : మాజీ మంత్రి అమర్‌నాథ్

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ వరదలకు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. వైసీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరద సమాచారం ఉన్నప్పటికీ ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం నేడు రాస్తారోకో

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 9 : స్టీల్‌ప్లాంటును పరిరక్షించడంతో పాటు ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కూర్మన్నపాలెం కూడలిలో రాస్తారోకో చేపడుతున్నట్టు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. ఈమేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం : ఈఓ

సింహాచలం, సెప్టెంబరు 9 :వర్షాల నేపథ్యంలో అధికారులు భక్తులకు ఇబ్బంది లేకుండా పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని సింహాచలం దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి ఆదేశించారు. సోమవారం ఆయన అధికారులతో కలిసి సింహగిరిపై పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

విజయవాడకు నిత్యావసరాల వితరణ

విశాఖపట్నం, సెప్టెంబరు 9 : విజయవాడ, పరిసర ప్రాంత వరద బాధితులకు నిత్యావసరాలు, కూరగాయలతో ఓ లారీ సోమవారం బయలుదేరింది. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పచ్చజెండాను ఊపి లారీని ప్రారంభించారు. వరద బాధితుల సహాయార్థం విశాఖపట్నం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, నగరంలోని అన్ని రైతుబజార్ల రైతులు, వ్యాపారులు, జ్ఞానాపురం న్యూ హోల్‌సేల్ మార్కెట్ వ్యాపారుల సహకారంతో సేకరించిన 10.5 మెట్రిక్ టన్నుల కూరగాయలు, నిత్యావసర సరకులను విజయవాడకు పంపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ శాఖాధికారి షేక్ యాసిన్, ఎస్టేట్ అధికారులు జి.ప్రసాద్, టీవై నాయుడు, వ్యాపారులు పరమేశ్వరరావు, ప్రసాద్, సత్యనారాయణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 15న గవర మహాసభ

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 9 : ప్రపంచ గవర మహా సభను డిసెంబరు 15న సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో నిర్వహించనున్నట్టు గవర ప్రపంచ చారిటబుల్ ట్రస్టు సీఏ ఏవీ రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందిస్తున్న మూడు సంఘాలను సత్కరిస్తామన్నారు. గవర జాతీయుల ఆచార వ్యవహారాలపై పుస్తకావిష్కరణ, తోడు నీడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి గవర సంఘాల ప్రతినిధులు హాజరుకావాలని కోరుతున్నామన్నారు.

బాలికకు ఆర్థిక సహాయం

సింహాచలం, సెప్టెంబరు 9 : జీవీఎంసీ 98వ వార్డు అంబేడ్కర్ నగర్ (ఎస్సీ కాలనీ)కి చెందిన సందాల స్వాతి కొంతకాలంగా ఊపిరితిత్తుల సమస్యతో చికిత్స పొందుతోంది.ఈమేరకు ఆ వార్డుకు చెందిన కర్రి అప్పలస్వామి ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, అడివివరం పీఏసీఎస్ అధ్యక్షుడు బాలికకు రూ. 10 వేల ఆర్థిక సహాయం చేశారు. ఈ మొత్తాన్ని సోమవారం ఆయన బాలికకు చికిత్స పొందుతున్న ఆసుపత్రిలో అందజేశారు. కార్యక్రమంలో ఎన్నిబాబు, మునపర్తి శివ, వెంకటరమణ పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మె

భీమునిపట్నం, సెప్టెంబరు 9 : స్థానిక జోనల్ కార్యాలయంలో మంచినీటి సరఫరా విభాగంలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది సోమవారం విధులు బహిష్కరించి, ఒకరోజు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సంకురుబోతు రవి మాట్లాడుతూ ప్రస్తుతం ఔట్ సోర్సింగ్ సిబ్బందిలో స్కిల్డ్ వర్కర్‌కు నెలకు రూ.18,500 ఇస్తున్నారని, దాన్ని రూ. 24,500 లకు పెంచాలన్నారు.అలాగే అన్ స్కిల్డ్ సిబ్బందికి నెలకు రూ. 15 వేలు వేతనం ఇస్తుండగా, దాన్ని రూ. 21 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.

‘డైట్’లో ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం

భీమునిపట్నం, సెప్టెంబరు 9 : అక్షరమే అభివృద్ధికి ఆసరా అని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతికుమారి అన్నారు. సోమవారం కళాశాల వసతి గృహాల వద్ద ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రవి, వైస్ ప్రిన్సిపాల్ మాణిక్యంనాయుడు, అధ్యాపకులు మాధవి, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు డ్వాక్రా సంఘాల సాయం

కొమ్మాది, సెప్టెంబరు 9 : విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి డ్వాక్రా సంఘాలు ముందుకు రావడం అభినందనీయమని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. వార్డులోని డ్వాక్రా సంఘాల సభ్యులు ఆర్పీల ద్వారా రూ. 55,550 చెక్కును సీఎం సహాయ నిధికి కార్పొరేటర్ ద్వారా అందజేశారు.

లోతట్టు ప్రాంతాల్లో నాయకుల పర్యటన

వార్డుల్లోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి, పరిస్థితులను సమీక్షించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా ఆదేశించడంతో ఆరో వార్డు కూటమి నాయకులు సోమవారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గరే గురునాథ్, రెడ్డి సత్యనారాయణ, సంతోష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.